ఏ మనిషినైనా
అతని బుద్ధి మాత్రమే
నాశనం చేస్తుంది
కానీ
అతని శత్రువులు కాదు

నిజాలు నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 28 సంచిక : 84 శుక్రవారం, డిసెంబర్ 19, 2025 , పేజీలు - 12 వెల : 2/-


## మహాత్ముడిని అవమానించారు

- రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంకగాంధీ




పంచాయితీ ఫలితాలు మా పాలనకు
# గీటురాయి

- రెండేళ్ల మా పాలన పట్ల ప్రజల్లో సానుకూలత
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం ఆదరించారు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇవే ఫలితాలు రిపీట్ అవుతాయి
- బిఆర్ఎస్, బిజెపి కూటమికి 3-శాతం కూడా సీట్లు దక్కలేదు
- ఇప్పటికైనా బిఆర్ఎస్ బుద్ధిగా మసలుకోవాలి



**హైదరాబాద్, 18 :** మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృత మవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ఆయన అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని ఆయన గుర్తు చేశారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ ధన్య వాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిచ దామోదర్ రాజనర్సింహలతో కలిసి సీఎం మాట్లాడారు. మూడు విడతల్లో మిగతా2లో...

## ప్రధాని మోడీకి మరో గౌరవం

ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారం ప్రదానం



స్థానిక ఎన్నికల్లో
## బలపడ్డాం

- బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



**యాదాద్రిభువనగిరి,డిసెంబర్ 18 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన బీజేపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు. దీనిలోభాగంగా ఆయన మాట్లాడుతూ.. ' మిగతా2లో...



## శాంతిభద్రతల్లో రాజీ పడొద్దు

- కలెక్టర్ల సమావేశంలో డిప్యూటి సిఎం

**అమరావతి,డిసెంబర్ 18 :** శాంతి భద్రతల విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు కఠినంగా ఉండాలని డిప్యూటీ సీఎం అన్నారు. శాంతి భద్రతలపై సమీక్షలో వివిధ అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే నేరాలను అస్సలు ఉపేక్షించొద్దని చెప్పారు.
మిగతా2లో...

వీబీ జీ రామ్ జీ' బిల్లుకు
## లోక్‌సభ ఆమోదం



- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నమన్న శివరాజ్‌సింగ్

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18 :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపా ధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీరామ్ జీ' పేరుతో తీసుకు వచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపి ంది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరస నల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండిం గ్ కమిటీకి పంపించాలని డిమాం డ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొ చ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' మిగతా2లో...

## చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం

- బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు
- పురస్కారాన్ని ప్రకటించిన ఎకనమిక్ టైమ్స్
- అభినందించిన డిప్యూటి సిఎం పవన్ తదితరులు




జిల్లా పరిషత్ ఎన్నికలకు
## సిద్ధం కండి

- భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలి
- సర్పంచ్ ఎన్నిక లఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం
- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే మనదే విజయం
- యాదాద్రి జిల్లాలో గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్




ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై
## త్వరలో నిర్ణయం

- అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం
- ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్,డిసెంబర్ 18:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశా ంతమైన వాతావరణం లో, ప్రజా స్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించిన ందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిన ందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వే షన్లను సాధించడంపై మిగతా2లో...

తెలంగాణ సర్కార్‌కు
# భారీ ఊరట



- 102 ఎకరాల భూమి అటవీశాఖదే అని తేల్చిన సుప్రీం
- స్వాధీనం చేసుకుని నోటిఫై చేయాలని సిఎస్‌కు ఆదేశం

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18 :**సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభిం చింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూమిపై వివాదం కొనసాగుతోంది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపం లోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు మిగతా2లో...

## చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం

**అమరావతి,డిసెంబర్ 18 :** ఏపీ సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ఎకనమిక్ టైమ్స్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. 'చంద్రబాబుకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రంతో పాటు మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకం. సంస్కరణలను చంద్రబాబు ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసంపై చూపిన నిబద్ధతకి ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ, సంస్కర ణాత్మక పాలనకు సీఎం స్ఫూర్తిగా నిలుస్తున్నదని లోకేశ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సీఎం చంద్రబాబుకి ఎకనమిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం సంతోషదాయ కమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలనిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రమంతటికీ గర్వ కారణంగా భావిస్తున్నాను. ఈ పురస్కారం ద్వారా రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పవన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ.. 'బిజినెస్ రీ ఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్ర మంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ముఖ్యమంత్రికి అవార్డు రావడం పట్ల మంత్రులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ అవార్డు తనకు లభించడంపట్ల సహచర మంత్రులు, అధికారులు, కలెక్టర్ల సమష్టి కృషి అని సీఎం చంద్రబాబు అన్నారు.

## వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

(వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎ త్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందో ళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహిం చగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది.అంతకుముందు బిల్లు తీరుపట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం అని తెలిపారు. ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. తొలుత ఉపాధి హామీ పథకానికిఎన్ఆర్‌జిఎ అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ-నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది.

తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.అనంతరం సభను వాయిదా వేశారు.

## పంచాయితీ ఫలితాలు మా పాలనకు గీటురాయి

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. 12,702 పంచాయతీలకు గాను 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ సాధించిందని తెలిపారు. 3,511 కాంగ్రెస్ , 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగాయని.. 87 నియోజక వర్గాల పరిధిలో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. ఖఆర్ఎస్, బీజేపీ కూటమికి 33శాతం విజయాలు మాత్రమే దక్కాయన్నారు. బీఆర్ఎస్‌కు 3,511 సర్పంచ్ స్థానాలు, బీజేపీ 710 చోట్ల గెలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 4,221 స్థానాలు మాత్రమే దక్కాయని సీఎం రేవంత్ తెలిపారు. ఇటీవల ప్రజాపాలన రెండేళ్ల సంబురాలు నిర్వహించుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం అని సిఎం అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమతి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోందని సీఎం అన్నారు.

## జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కండి

**యాదాద్రి భువనగిరి,డిసెంబర్ 18 :** జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని కేటీఆర్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని లంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. తినే ప్లేటులో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లావ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కిపైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని, గబ్బిలాలు సూరు పట్టుకుని వేలాడినట్లు వీరి పరిస్థితి తయారైందని ఘాటుగా విమర్శించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతారని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు.

## ప్రధాని మోడీకి మరో గౌరవం

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18 :** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం.భారత్ – ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్–కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

## మహాత్ముడిని అవమానించారు

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18 :** మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. నరేగా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు.

## తెలంగాణ సర్కార్‌కు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు వెలువడిన 8 వారాల్లో ఆ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా నోట్గి÷ చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్ కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం సూచించింది. దీంతో 2 దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదం ఓ కొలిక్కి వచ్చింది.

## శాంతిభద్రతల్లో రాజీ పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

15 శాతం వృద్ధిరేటు సాధించాలంటే శాంతిభద్రతలు చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. నేరాల్లో నిర్లిప్తంగా ఉండటం సరికాదని పవన్ కళ్యాణ్ సూచించారు.'15 శాతం వృద్ధి రేటు సాధించాలంటే శాంతిభద్రతలు చాలా ముఖ్యం. విశాఖలో కొందరు ఆకస్మికంగా వచ్చి దాడి చేస్తే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా ఏమీ పట్టించుకోలేదు. కొందరు రాజకీయ నేతలు దీని వెనుక ఉన్నారు, చర్యలు తీసుకోకపోవటం ఇబ్బందికరం. నేరాల్లో నిర్లిప్తంగా ఉండటం సరికాదు. అధికారంలో ఉండి కూడా ఏమీ చేయటం లేదనే విమర్శలు ఎదుర్కొంటున్నాం. కఠినంగా వ్యవహరించాలని ఎస్పీలు, కలెక్టర్లను ఆదేశిస్తున్నాం. ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగించేలా జరుగుతున్న నేరాల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు' అని కలెక్టర్లు, ఎస్పీలతో డిప్యూటీ సీఎం పవన్ అన్నారు.ఇక 22వ తేదీన జనసేన 'పదవి బాధ్యత' సమావేశం జరగనుంది. కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ తరఫున నామినేటెడ్ పదవులు పొందిన వారితో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నారు. వారికి పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశర చేస్తారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా స్థాయి పదవులు, ఏఎంసీ, పిఏసిఎస్, నీటి సంఘాలలో నామినేటెడ్ పదవులకు ఎంపికైన వారు ఈ సమావేశంలో పాల్గొంటారు.

## స్థానిక ఎన్నికల్లో బలపడ్డాం

(మొదటి పేజీ తరువాయి)

యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 సర్పంచులు 20 మంది ఉపసర్పంచ్లు 1000 వార్డులు గెలిచాం. రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం. గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో కూడా బీజేపీ బలం పెరుగుతుంది. కాంగ్రెస్ అధికార బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథ కాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పని అయిపోయింది వారి అవినీతి గురించి వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో మినిస్టర్ పీఏలు తుపాకులు పెట్టి బెదిరిస్తున్నారు, రాజ్యాంగం మీద గౌరవం లేని వ్యక్తి రాహుల్ గాంధీ. బీఆర్ఎస్‌నే ఫిరాయింపుల మొదటి ప్రోత్సహించింది. ప్రభుత్వం ఒత్తిడితో స్పీకర్ రాజ్యాంగం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. రాహుల్ గాంధీ సోనియాగాంధీ వారి వారి కేసులలో బెయిల్ పై ఉన్నారు. బీజేపీ వారిపై కేసు పెట్టలేదు దర్యాప్తు సంస్థలు కేసు పెట్టాయి. మా పార్టీ కార్యాలయంలపై దాడి చేస్తే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తే కాంగ్రెస్ పార్టీదే పూర్తి బాధ్యత' అని రామచంద్రరావు పేర్కొన్నారు.

## ఎంపీటీసీ, జేడ్పీటీసీ, మున్సిపల్

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జేడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా, ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో అధికారులు స్వేచ్ఛగా పనిచేశారని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహారు, ధనసరి అనసూయ సీతక్కలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం

# విద్యార్థులకు గురుకుల పుస్తకాల పంపిణీ




**చర్చ: వైరా :** వైరా సిపిఎస్ (గుట్ట బడి) మరియు పిఎస్ రెబ్బవరం పాఠశాలలో తల్లపురెడ్డి గోపాల కృష్ణా రెడ్డి తమ దివంగత కుమారుడు విక్రాంత్ రెడ్డి 43వ జన్మదినం సందర్భంగా ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న 4వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థిని విద్యార్థులకు గురుకుల ప్రవేశ పరీక్ష గైడులను అందజేస్తూ ఈ రెండు పాఠశాలలో జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలలో ప్రధమ ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేస్తాను అని ప్రకటించరు ఈ కార్యక్రమాల్లో రెబ్బవరం ప్రధానోపాధ్యాయులు ఆమడాల సుధాకర్, సిపిఎస్ (గుట్ట బడి) వైరా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి, సీనియర్ ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్ర రావు మాట్లాడుతూ దివంగత విక్రాంత రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని వారి పేరు మీద ఇలాంటి సహాయా సహకారాలు పిల్లలందరికీ తమ జీవితంలో చదువులు కొనసాగే విధంగా తోడ్పడతాయని కొనియాడినారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సల్మా, పద్మ, కృష్ణ కుమారి, ఆఫీస్ సిబ్బంది వైష్ణవి పాల్గొన్నారు..

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు



**చర్చ: వైరా :** వైరా మండలం తాటిపూడి గ్రామంలో గురువారం జరిగిన అయ్యప్ప స్వాముల మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ జవ్వాజి అశ్విని మాట్లాడుతూ అయ్యప్ప స్వాములు ఎంతో భక్తితో ఎంతో నిష్టతో మాల ధరిస్తారని ఆ భగవంతుడు శబరిమలై సాక్షిగా ప్రజలను చల్లగా చూడాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకుడు జవ్వాజి నాగరాజు పలువురు మాల ధరించిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు

# వైరా మున్సిపలటీ బరిలో రేచర్ల వెంకటేష్

**రాజకీయాలకు అతీతంగా వెంకటేష్ కు పెరుగుతున్న మద్దతు**

**బరిలో నిలవాల్సిందే అంటున్న యువత**



**చర్చ: వైరా :** వైరా మున్సిపాలిటీలో పలు జనరల్ వార్డులపై యువ నాయకుడు యూత్ మంచి ఫాలోయింగ్ ఉన్న యువకుడు కష్టం వస్తే మేమున్నామని అండగా ఉండే సోదరులలో ఒక్కడైనా రేచర్ల స్వామి సీతమ్మ దంపతుల రెండవ కుమారుడైన రేచర్ల వెంకటేష్ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల భారీలో నిలవను న్నాడు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని పలు జనరల్ వార్డులలో రేచర్ల వెంకటేశును బరిలో నింపేందుకు స్నేహితులు పలువురు రాజకీయ నాయకులు రాజకీయాలకు అతీతంగా బరిలో నింపేందుకు పూర్తిస్థాయిలో సలహాలు చేస్తున్నారు, రేచర్ల వెంకటేష్ స్థాయిలో ఉన్న ఓ రాజకీయ నాయకుడు ముఖ్య అనుచరుడు లా ఉన్నడు. . రేచర్ల వెంకటేష్ రేచర్ల శ్రీకాంత్ సోదరులతో ఓ బలమైన రాజకీయ పార్టీ సమావేలోచన జరిపి బరిలో దిగాలని చెప్పినట్లు సమాచారం. అయితే రేచర్ల వెంకటేష్ కు రేచర్ల యూత్ లో తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకొని సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆపదలో ఉన్నవారికి అండగా ఉన్నాడనే బలమైన వాదన ప్రజల్లో వినిపిస్తుంది. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో బరిలో నిలబడేందుకు రేచర్ల వెంకటేష్ కు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుంది. పలువురు రాజకీయాలకు కచ్చితంగా రేచర్ల వెంకటేష్ ను త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో నిలబడాలని విన్నపాలు కూడా వెలుగుతున్నాయి. అయితే పలువురు మాత్రం రేచర్ల వెంకటేష్ బరిలో నిలబడితే వార్ వన్ సై డే అనే వాదన కూడా వినిపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో యువ నాయకుడు రేచర్ల వెంకటేష్ రాజకీయ భవిష్యత్తు కు పునాది వేయనున్నట్టు తెలుస్తుంది

# అంగన్వాడీ సమావేశాన్ని మత రాజకీయం చేయొద్దు సిఐటియు ఖండన

- బహిరంగ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం నిర్మించాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్



**చర్చ: ప్రతినిధి: కుక్కునూరు డిసెంబర్ 18:** అంగన్వాడీ సమావేశాన్ని ఒక మతానికి అంటగడుతూ రాజకీయం చేయొద్దు అని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ఖండించారు. గురువారం నాడు స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయం నుండి సిఐటియు కుక్కునూరు మండల కమిటీ ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరుతూ బుధవారం నాడు కుక్కునూరు చర్చిలో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశాన్ని మతం పేరుతో రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రధానంగా కుక్కునూరుకి కొత్తగా ప్రాజెక్టు ఏర్పడిందని, కానీ ప్రభుత్వం కార్యాలయం నిర్మించలేదని, ప్రస్తుతం సచివాలయంలో ఒక గదిలో కార్యాలయం ఏర్పాటు చేశారని, ప్రాజెక్టు మొత్తం 160 మంది అంగన్వాడీలకు సమావేశం ఏర్పాటు చేసే స్థలం లేదని, అదేవిధంగా బహిరంగ మరుగుదొడ్లు కూడ లేవని, మహిళలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని అంత మందికి ఒకే సారి మిటింగ్ పెట్టె స్థలం లేకపోవడంతో దగ్గర్లో ఉన్న చర్చిలో అందరి అభిప్రాయం మేరకు నిర్వహించారు అంతేకాని, మత బోధనలు, మత ప్రచారాలు ఏమి చేయలేదని కేవలం మహిళలు ఇబ్బందులు రీత్యా సమావేశం ఏర్పాటు చేశారు అని అన్నారు. ఈ సమావేశాన్ని మత రాజకీయం చేయడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రాజెక్టు కార్యాలయం నిర్మాణం చేపట్టి, మండల ప్రజలు అందరికి బహిరంగ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆయన ప్రకటనలో కోరారు.

# హేమచల లక్ష్మి నరసింహా స్వామి ని దర్శించుకున్న పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్ గుమ్మడి సోమయ్య



**చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 18: (మంగపేట) :** మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి ఆధ్వర్యంలో మంగపేట మండలం లోని మల్లూరు గ్రామం రెండవ యాదగిరి గుట్ట గా ప్రసిద్ధి గాంచిన కలియుగ దైవం శ్రీ హేమచల లక్ష్మి నరసింహా స్వామి ఆలయం కు గుమ్మడి సోమయ్య చేరుకున్నారు. అనంతరం స్వామి వారి దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ నిన్నటి రోజున మన ఆడబిడ్డ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు, సమ్మక్క – సరళమ్మ ల ప్రతిరూపం ధనసరి అనసూయ సీతక్క చొరవ తో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గా నాకు అవకాశం కల్పించినందుకు సీతక్క కు అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతున్న సందర్భంలో జడ్పీటీసీ గా పోటీ చేసే అవకాశం రావడం తో మంగపేట మండలం నుండి గెలిచి 2001 నుండి 2006 వరకు పనిచేసి తదుపరి మేజర్ గ్రామ పంచాయతీ కమలాపురం కు 2006 నుండి 2011 వరకు సర్పంచ్ గా పని చేసి కాంగ్రెస్ పార్టీ లో ఇప్పటివరకు ములుగు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గా పని చేస్తున్నా తరుణంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కు రాష్ట్ర డైరెక్టర్ గా ఇంతటి గొప్ప అవకాశం ఇచ్చినందుకు మంత్రి సీతక్క కి జిల్లా అధ్యక్షులు పైడకుల అశోక్ కు మరొకసారి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు ఈ కార్యక్రమం లో.... జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# యాప్ లో కాదు సోసైటి లో యూరియా సరఫరా చేయాలి

- స్థానిక రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు
- వైరా సోసైటి వైస్ చైర్మన్ కొణెదన కోటేశ్వరరావు



అష్ణగుర్తి గ్రామం లో జరిగిన రైతు సంఘం సమావేశం లో రాంబాబు, కోటేశ్వరరావు

**చర్చ :వైరా :** రబీ సీజన్ డిసెంబర్ 20 తేదీ నుంచి స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు యూరియా సరఫరా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఉపసంహరించుకోవాలని, స్థానిక రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా సోసైటి వైస్ చైర్మన్ కొణెదన కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.గురువారం వైరా మండలం అష్ణగుర్తి గ్రామం లో జరిగిన రైతు సంఘం సమావేశం లో రాంబాబు, కోటేశ్వరరావు మాట్లాడుతూ చదువు రాని రైతులు, స్మార్ట్ ఫోన్లు ఉపయోగించే అవగాహన లేని రైతులు యూరియా పోందడం కష్టం అవుతుంది అని అన్నారు, పంటలకు యూరియా అవసరమైన అప్పుడు రైతులు స్మార్ట్ ఫోన్లు ద్వారా యూరియా బుక్ చేస్తే వారం, పది రోజుల తర్వాత సరఫరా అయి పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుంది అని అన్నారు. గతం లో లాగా సోసైటి లు, డీలర్లు ద్వారా యూరియా సరఫరా చేయాలని కోరారు, వైరా మండలం లో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయాలి అని ఈ సంవత్సరం ధాన్యం దిగుబడి తగ్గింది అని రైతులు స్వంత ట్రాక్టర్లు ద్వారా రైస్ మిల్లులకు ధాన్యం తరలింపుకు అవకాశం ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తారు నాగరాజు, రేమల్ల నారా యణ, శ్రీరమనేని సీతారామయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# క్రిస్టమస్ శాంతి, ప్రేమ, కరుణకు ప్రతీక జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :** క్రిస్టమస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్టమస్ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు శాంతాక్లాజ్, వేషధారణలతో పాటు నృత్యాలు, పాటలు, సందేశాత్మక ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. క్రిస్టమస్ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, క్రిస్టమస్ పండుగ శాంతి, సంతోషం, ప్రేమ, కరుణ, త్యాగం వంటి విలువలను సమాజానికి గుర్తు చేసే గొప్ప పండుగ అని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్టమస్ పండుగ యొక్క అసలైన సందేశమని తెలిపారు. క్రిస్టమస్ పండుగను క్రైస్తవ సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్రిస్మస్ ప్రతి ఇంట్లో ప్రేమ, సంతోషం, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణ లత లెనీనా, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, టీజీవోస్ జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు జిల్లా అధికారులు, పాస్టర్లు ప్రభుదాస్, తిమోతి,ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# గవర్నమెంట్ పాలిటెక్నిక్, కొత్తగూడెం జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు మరియు ఆటల నిర్వహణ సమాచారం

**చర్చ, కొత్తగూడెం :** గవర్నమెంట్ పాలిటెక్నిక్, కొత్తగూడెం ప్రిన్సిపాల్ మరియు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ శ్రీ బండి శ్రీనివాస్ తెలియజేసిన సమాచారం ప్రకారం, జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు మరియు ఆటలు డిసెంబర్ 19 మరియు 20 తేదీలలో గవర్నమెంట్ పాలిటెక్నిక్, కొత్తగూడెం ప్రాంగణంలో నిర్వహించబడనున్నాయి.ఈ క్రీడా పోటీలలో జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన విద్యార్థులు (8 కళాశాలలు, 210 మంది విద్యార్థులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలు, జట్టు సమన్వయం మరియు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, స్నేహభావం మరియు ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందించబడుతుందని తెలిపారు.
ప్రారంభోత్సవ కార్యక్రమం 2025 డిసెంబర్ 19న ఉదయం 9:30 గంటలకు నిర్వహించ బడనుండగా,విశిష్ట అతిథులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాని ౖ లాంఛనంగా ప్రారంభిస్తారు. రెండు రోజుల పాటు వివిధ జట్టు మరియు వ్యక్తిగత క్రీడా ఈవెంట్లు నిర్వహించబడతాయి. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను 2025 డిసెంబర్ 20న జరిగే ముగింపు కార్యక్రమంలో విశిష్ట అతిథుల చేతుల మీదుగా అందజేయనున్నట్లు గవర్నమెంట్ పాలిటెక్నిక్, కొత్తగూడెం ప్రిన్సిపాల్ శ్రీ బండి శ్రీనివాస్ తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్



**చర్చ, కొత్తగూడెం లీగల్ సెల్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని అన్ని కోర్ట్ లలో డిసెంబర్ 21న (ఆదివారం) తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలనీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్ ) రాజీ చేసుకోవచ్చని అన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం వలన సమయం, డబ్బు అదా అవుతుందని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం కొరకై ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున అత్యధిక కేసులను పరిష్కరించడం కొరకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

1.యాక్సిడెంట్ కేసులు 2.సివిల్ కేసులు 3.చీటింగ్ కేసులు
4.చిట్ పన్డ్ కేసులు 5.భూతగాదాలు కు సంబంధించిన కేసులు
6.వివాహ బంధానికి సంబంధించిన కేసులు 7.చిన్నచిన్న దొంగతనం కేసులు 8.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
9. కుటుంబ తగాదాలు 10. బ్యాంకు లావాదేవీల కేసులు11. టెలి ఫోన్ బకాయిల కేసులు 12. కొట్టుకున్న కేసులు
13. సైబర్ క్రైమ్ కేసులు 14. చెక్ బౌన్స్ కేసులు

ఈ లోకదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష







**చర్చ,గోదావరిఖని:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న వివిధ అబివృద్ధి కార్యక్రమాలను గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరిఖని సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సింగరేణితో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలన్నారు.గోదావరిఖని నది ఒడ్డున ఉన్న స్మశాన వాటిక అభివృద్ధి కోసం డి పి ఆర్ తయారు చేయాలని అదికారులకు సూచించారు. అశోక్ నగర్ లోని గర్ల్స్ హై స్కూల్ అభివృద్ధి కోసం కోటి రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. డిజైన్ ప్రకారం అభివృద్ధి పనులను నెల రోజులలో పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు.
గౌతమ్ నగర్ వద్ద గల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు వేగంగా పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు. రామగుండం చౌంస్తా వద్ద చేపట్టిన ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అదికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అడిషనల్ కమిషనర్ మారుతి ప్ర సాద్, గురు వీర, ఈఈ రామన్ ,ఆర్ అండ్ బి ,అదికారులు పాల్గొన్నారు.

# బొగ్గు బ్లాకులు సింగరేణికి దక్కేలా కృషి చేయండి

- పెద్దపల్లి ఎంపి వంశీ ని కోరిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్



చర్చ,గోదావరిఖని:తెలంగాణ లో ఉన్న ఏకైక పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ ఐన సింగరేణి ని తెలంగాణ బిజెపి కి చెందిన పార్లమెంటు సభ్యులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం తెలంగాణ ప్రజలను, నిరుద్యోగులను, సింగరేణి కార్మికులను అవమానపరుస్తున్నారని అన్నారు. వెంటనే తెలంగాణకు చెందిన బిజేపి ఎంపి లు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి సింగరేణి యాజమాన్యం కోట్ల రూపాయలు ఖర్చు చేసి గుర్తించిన బొగ్గు బ్లాక్ లను సింగరేణి కి దక్కె విధంగా చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న బొగ్గు గనులు ఎంఎండిఆర్ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు సంస్థలు దక్కించుకోవడం వల్ల కార్మికులు, ఉద్యోగులు మరియు దీని పై ఆధారపడి జీవిస్తున్న వేల మంది కుటుంబాలు తీవ్రంగా నష్టపోతారని, నిరుద్యోగుల కు ఉపాధి అవకాశాలు రావని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆర్థికంగా సామాజికంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కనుక తెలంగాణ లో ఉన్న బిజెపి ఎంపి లు కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి ఎంఎండిఆర్( మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్మెంట్ రెగ్యలేషన్ యాక్ట్) చట్టం సెక్షన్ 17 కింద సింగరేణి కి బొగ్గు గనుల ను కేటాయించి తెలంగాణ ప్రాంత నిరుద్యోగుల కు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై పెద్దపల్లి ఎంపి వంశీ క్రిష్ణ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి తెలంగాణా లో ఉన్న బొగ్గు బ్లాక్ లను సింగరేణి కి దక్కె విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇట్టి విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి సింగరేణి కి బొగ్గు గనులు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిచో అన్ని ప్రజా సంఘాల ను కలుపుకొని బిజేపి ఎం పి ల ఇండ్లను ముట్టడి కార్యక్రమం కు పిలుపు నిస్తామని ఆయన హెచ్చరించారు.

# కుకునూరు మండలం లంకలపల్లి నుంచి వేలేరు వరకు ఆర్ అండ్ బి రోడ్డు గోతులు పూడ్చి రెం డో లేరు డాంబర్ పోయాలి

- నాణ్యత లోపం నాశరకం ఆర్ అండ్ బి ర్రోడ్డు నిర్మాణంతో మూడు అడుగుల మేర గోతులు ఏర్పడినాయి..
- స్కూల్ బస్సులు పిల్లలను ఉదయం సాయంత్రం తరలించడానికి ఇబ్బందులు గురవుతున్నారు




చర్చ:ప్రతినిధి: కుకునూరు :సిపిఐ ఎంఎల్ ప్రజాపంద కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బిరోడ్డుపై పడిన గోతులు పునర్నిర్మానం చేయాలని, రెండవ లేయర్ రోడ్డు నిర్మాణం చేయాలని, కుక్కునూరు మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తాసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు. కుకునూరు మండలం కోమట్ల గూడెం వద్ద, ఉప్పేరు వద్ద మూడు అడుగుల మేర కోతులు ఏర్పడ్డాయి, కుక్కునూరు మండల కేంద్రం గ్యాస్ గోడౌన్ గోతులు ఉన్న రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపందా ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్కె గౌస్ మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను గాలికి వదిలేసిందని, కుడుముల పాడు ఆంధ్ర సరిహద్దు నుండి వేలేరు వరకు43 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం గత ఎనిమిది నెలల క్రితం రోడ్డు పనులు చేపట్టి నారు. ఆర్ అండ్ బి డాంబర్ రోడ్డు నాసిరకంగా ఉందని,ఈ రోడ్డు నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని, ఎనిమిది నెలల కాకముందే రోడ్డుపై మూడు అడుగులు లోతులో భారీ గోతులు ఏర్పడి నాయి. అడుగడుగుకి గొయ్యిఏర్పడి నిత్యం స్కూల్ పిల్లల బస్సులు, ద్విచక్ర వాహనదారులు,కార్లు, ఆటోలు, బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, అనారోగ్య తో ఉన్నవారికి పరిస్థితి విషమించినప్పుడు మెరుగైన వైద్యం కోసం అనేక గ్రామాల నుండి జంగారెడ్డిగూడెం, భద్రాచలం హాస్పిటల్స్ కు వెళ్లే రోగులు సకాలంలో హాస్పిటల్స్ కు చేరక వైద్యం అందక ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందని, ఇంత జరుగుతున్న ఆర్ అండ్ బి అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని, రెండవ లేయర్ రోడ్డు నిర్మాణం చేయించడంలో నిర్లక్ష్య వైఖరిని అవలంబించారని, రెండో లేరు వెంటనే నిర్మాణం చేపట్టాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపందా ఆర్ అండ్ బి డివిజన్ జిల్లా అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బి. సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి కె. కల్లయ్య, పి ఓ డబ్ల్యు నాయకురాలు ఎస్కె మున్ని, ఉపేందర్, మడివి నవీను, గంగరాజు,%ం%.రాజు, సోడే దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్‌కు ఊరట

- డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న ఆధ్వర్యంలో ధర్నా




చర్చ, కొత్తగూడెం :విద్యానగర్ కాలనీ నేషనల్ హైవేపై జరిగిన ధర్నాల లో జిల్లా డిసిసి అధ్యక్షురాలు దేవి ప్రసన్న మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టు ఊరటనిచ్చిన నేపథ్యంలో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యానగర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్న పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా దేవి ప్రసన్న మాట్లాడుతూ, రాజకీయ కక్షతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీని ముందుకు నెట్టి అక్రమంగా కేసులు పెట్టిందని తీవ్ర విమర్శలు చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ దాఖలు చేసిన ఫిర్యాదు, ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ఢిల్లీ కోర్టు నిరాకరించడమే సత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులను రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే రద్దు చేయడం ద్వారా న్యాయం గెలిచిందని అన్నారు.సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు దేశ ప్రజల కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకులని, అలాంటి నేతలపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని ప్రయత్నించడం ప్రజలు ఎప్పటికీ సహించరని దేవి ప్రసన్న హెచ్చరించారు. ఈడీని రాజకీయ సాధనంగా మార్చి ప్రతిపక్షాలను అణిచివేయాలన్న ప్రయత్నాలకు కోర్టు తీర్పు చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పార్టీ న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంచిందని, సత్యం, న్యాయం ఎప్పటికైనా గెలుస్తాయని ఈ తీర్పు మరోసారి నిరూపించిందని ఆమె తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పోరాడుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. సత్యమేవ జయతే అంటూ స్లొగన్స్ వినిపించారు.ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# పోచమ్మ దేవాలయం పనులను పరిశీలించిన మంత్రి పొన్నం



చర్చ:- హుస్నాబాద్: పట్టణంలో గురువారం రోజున రాష్ట్ర రవాణా బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మార్నింగ్ వాక్ లో భాగంగా శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సమీక్షించడం జరిగింది మంత్రిగారు సొంతంగా నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ దేవాలయం పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది సిజిఎఫ్ నిధులతో నిర్మిస్తున్న అనివేటి మండపం సంబంధిత కాంట్రాక్టర్ సీత రాహుల్ కుమార్ ను పనులు తొందరగా పూర్తి చేయాలని మరియు అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న డార్మెటరీ హాల్ ఒకటి పూర్తికాగా మిగిలిన రెండు కూడా చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తానని మంత్రిగారు చెప్పడం జరిగింది అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగం వారిని పిలిచి వసతి గదులు కోసం ప్లాన్స్ అండ్ ఎస్టిమేట్ చేయమని ఆదేశించడం జరిగింది శ్రీ అమ్మవారి సేవలో పి కిషన్ రావు కార్యనిర్వహణాధికారి.

# మల్లూరు గుడి వద్దకు పాదయాత్ర చేయనున్న బిఆర్ఎస్ అభిమాని కుదురుపాక రాజేష్



ఏటూరునాగారం :మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో కాకులమర్రి లక్ష్మి నర్సింహారావు సతీమణి శ్రీలత భారీ మెజారిటీ తో గెలుపొందాలని, గెలిస్తే ఏటూరునాగారం మండల కేంద్రం నుండి మల్లూరు హేమాచలా లక్ష్మి నర్సింహా స్వామి గుడి వరకు పాద యాత్ర చేసి మొక్కులు చెల్లిస్తానని ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు అభిమాని, జర్నలిస్ట్ కుదురుపాక రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఫలితాల్లో 3230 ఓట్ల భారీ మెజారిటీతో కాకులమర్రి శ్రీలత గెలుపోందారు కాగా ఈ నెల 24 వ తేదీన బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని కరకట్ట హనుమాన్ గుడి వద్ద నుండి మల్లూరు హేమాచలా లక్ష్మి నర్సింహా స్వామి గుడి వరకు పాద యాత్ర చేయనున్నట్లు తెలిపారు.

# ఆకునూరి నాగార్జున ను పరామర్శించిన బిఆర్ఎస్ శ్రేణులు



చర్చ, డిసెంబర్ 18, గోవిందరావు పేట్ :గోవిందరావు పేట్ మండలం చల్వాయి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్త ఆకునూరి నాగార్జున తల్లి ఆకునూరి కల ఇటీవల మరణించడం జరిగింది.నాగార్జున కుటుంబాన్ని గురు వారం పరామర్శించి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని బి ఆర్ఎస్ పార్టీ ఇట్టి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని చల్వాయి బి ఆర్ ఎస్ పార్టీ భరోసానిచ్చింది నాగార్జున కుటుంబం కొంత ఆర్థికంగా వెనుకబడ్డ కారణంగా చల్వాయి గ్రామ కమిటీ 50 కేజీల బియ్యానికి ఆర్థిక సాయం చేయడం జరిగింది మరియు మండల జిల్లా కమిటీకి తెలియజేసి నాగార్జున కుటుంబానికి అన్ని విధాల బి ఆర్ఎస్ పార్టీ అండగా ఉండే విధంగా చూస్తామని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ చల్వాయి అధ్యక్షులు నామ్ పూర్ణచందర్ అధికార ప్రతినిధి భూ రెడ్డి మధు సీనియర్ నాయకులు రేండ్ల శ్రీనివాస్ దర్శనాల సంజీవ కొంపెల్లి కృష్ణారెడ్డి కుమ్మరి వెంకన్న పల్లపు కుమార్ గజ్జల రంజిత్ మరియు టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'గోపా' స్వర్ణోత్సవ సభ విజయవంతం చేయాలి.

## జిల్లా అధ్యక్షులు మండ రమేష్ గౌడ్ పిలుపు



చర్చ,గోదావరిఖని:గౌడ అఫిషియల్స్,ప్రొఫెషనల్ (గోపా) స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా,ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని గోప పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మండ రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనే ధ్యేయంగా గౌడ బిడ్డలను విద్యావంతులుగా తీర్చిదిద్దడమే గోపా ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.గత ఐదు దశాబ్దాలుగా విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేస్తూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ హైదరాబాద్ వంటి నగరాల్లో ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తూ వారి ఉన్నత చదువులకు బాసటగా నిలుస్తోందని అన్నారు.ఈ క్రమంలో హైదరాబాద్‌లో జరగబోయే భారీ బహిరంగ సభకు పెద్దపల్లి జిల్లా నుంచి కుల బాంధవులు, విద్యావంతులు,వృత్తి నిపుణులు భారీ సంఖ్యలో హాజరై స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గోప ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్,కోశాధికారి దేవేందర్ గౌడ్,నాయకులు మాచిడి మహేందర్ గౌడ్,చంద్రయ్య,ఎల్లా గౌడ్,బాలసాని స్వామి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో అభివృద్ధి కోసం బైక్ పై మంత్రి ఆరా



చర్చ:- హుస్నాబాద్:హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సుడిగాలి పర్యటన నిర్వహించి మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు స్థానిక నాయకులు పార్టీ కార్యకర్తలతో కలిసి బైక్ పై వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ రోడ్లు డ్రైనేజీలు కమ్యూనిటీ హాళ్లు జంక్షన్లో అభివృద్ధి పనులు పురోగతిని స్వయంగా పరిశీలించారు ఈ సందర్భంగా అంబేద్కర్ భవనను సందర్శించిన మంత్రి అక్కడ జరుగుతున్న సిసి రోడ్లు డ్రైనేజీల పర్యవేక్షించారు ఇప్పటికే శంకుస్థాపన చేసిన రోడ్లు డ్రైనేజీలు కమ్యూనిటీ హాళ్లు జంక్షన్ లో పనులు పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతం చేయాలని నాణ్యత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు పట్టణంలో ఇంకా ఎక్కడెక్కడ రోడ్లు డ్రైనేజీ పనులు అవసరం ఉన్నాయో ఆరా తీశారు స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు హుస్నాబాద్ మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణం గా తీర్చిదిద్దేలా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.

# విద్యార్థుల హామీలు నెరవేర్చాలి..




చర్చ : ప్రతినిధి : కుక్కునూరు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని సీపీఐ కుక్కునూరు మండల సెక్రటరీ కురాకుల.బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పిలుపులో భాగంగా కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు.అనంతరం విద్యా రంగ సమస్యలపై కుక్కునూరు ఎమ్మార్వో రమేష్ బాబు కి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ సభ్యులు శౌర్య, క్రాంతి చైతన్య, ప్రేమ్, వరుణ్, లక్కీ, బ్రహ్మ తేజ, ఆదర్శ్, అరుణ్, ప్రశాంత్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ సువర్ణ సాహితి




చర్చ:- హుస్నాబాద్:69 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి 19 సంవత్సరాల బాల బాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలలో బాలికల జూనియర్ కళాశాల హుస్నాబాద్ లో సి ఈ సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ సువర్ణ సాహితి ఈ రోజు వెంకట్ రెడ్డి స్పోర్ట్స్ అకాడమీ ఓల్డ్ ఆల్వాల్ సికింద్రాబాదు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించింది. జనవరి 2026 లో ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి. లలిత గారు తెలియజేశారు. జాతీయ పోటీలలో కూడా రాణించి రాష్ట్రానికి కళాశాలకు పేరు తీసుకురావాలని జాతీయ స్థాయిలో కూడా మెడల్ సాధించి ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపల్ వి. లలిత కళాశాల అధ్యాపక బృందం పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ అభినందించారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన డాక్టర్ తుకారం రాథోడ్





చర్చ, పాల్వంచ :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గుడిపాడు, అశ్వాపురం మరియు మణుగూరు ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది అందరు సమయ పాలన పాటిం చాలని, అందరు తమ తమ ఉపకేంద్రాలందు దగ్గర్లో అందుబాటులో ఉండాలని లేనియడల శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కుష్ఠ వ్యాధిగ్రాస్తుల గుర్తింపు ఉద్యమంను ఆశ కార్యకర్తలు చేస్తున్న సర్వే ను పరిశీలించిన తరువాత ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలందు జరిగిన శ్రమదాన కార్యక్రమం నందు సిబ్బందితో పాల్గొని వాటి పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ శ్రమదానం కార్యక్రమం నందు పాల్గొన్న సిబ్బంది అందరు తమ అందాన్ని సంతోషాన్ని వ్యక్తపరిచారు .ఈ కార్యక్రమం చాలా ఆహ్లాదకరంగా సంతోషంగా మన కేంద్రాన్ని మనమే శుభ్రం చేసుకున్నామని ,అందరం తారతమ్యాలు మరిచి ఈ కార్యక్రమం ఇలాగే ముందుకు తీసుకోని వెళ్లుతామని సిబ్బంది అందరు హార్షం వ్యక్తపరచారు. ఈ కార్యక్రమం నందు డాక్టర్ పుల్లారెడ్డి పిఓ ఎన్టీ ఈపి, డాక్టర్ నిశంత్, డాక్టర్ సంకీర్తన, మోహన్ డీపీఎంఓ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ఆదివారాహ స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్



చర్చ:కమాన్‌పూర్:కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్వయంభు శ్రీ ఆదివారాహ స్వామి దేవాలయాన్ని గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ ఆదివారాహ స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శిం చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆలయ సిబ్బందితో చర్చించారు. ఆలయ పరిరక్షణ, సంప్రదాయాల కొనసాగింపుపై అవసరమైన సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

## మేయర్ పునుకొల్ల నీరజాను పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి



ఖమ్మం :మేయర్ పునుకోల్ల నీరజాను గురువారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు .గత కొన్ని రోజులుగా మేయర్ నీరజా అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ ఆమెను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు రంగా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

## రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలి

● జిల్లాకలెక్టర్ కోయ శ్రీ హర్ష



చర్చ,పెద్దపల్లి:రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతీ రేషన్ కార్డుదారు తన యొక్క వేలిముద్ర సహాయంతో వంద శాతం ఈ కెవైసి పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 76.29 శాతం మాత్రమే పూర్తి చేసుకున్నారని, మిగిలిన (1,68,272) రేషన్ కార్డు లబ్దిదారులు, ఐదు సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్నవారు అందుబాటులో వున్న రేషన్ షాపునకు వెళ్ళి తమ యొక్క ఈ కెవైసి తప్పక పూర్తిచేసుకోవాలన్నారు.
ఐదు సంవత్సరాల వయసు పూర్తి కాని పిల్లలకు ఈ కెవైసి నుండి మినహాయింపు ఇచ్చినట్లు పేర్కొన్నారు.రేషన్ షాపు డీలర్లు ఈకెవైసి పూర్తిచేయుటకు సహకరించాలని పేర్కొన్నారు. షాపు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## గెలిచిన సర్పంచ్ లకు మంత్రి పొంగులేటి చిరు సన్మానం



చర్చ, కొత్తగూడెం :గురువారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీను క్యాంపు కార్యాలయ ఆవరణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా జరిగిన పంచాయతీ ఎన్నికలలో కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లందు, అశ్వరావుపేట, పినపాక నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ పక్షాన నూతనంగా గెలిచిన సుమారు 369 మంది సర్పంచులకు మరో 396 మంది ఉపసర్పంచ్ లకు రాష్ట్ర మంత్రివర్యులు రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మాత్యులు గౌరవ శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సత్కరించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలపి, గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా శక్తివంచన లేకుండాపనిచేయాలని, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తూము చౌదరి, డిసిసి అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, నాగ సీతారాములు, పూణెం శ్రీనివాస్, జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎం.డి. గౌస్ పాషా, రైల్వే బోర్డు మెంబర్ వైయస్ శ్రీనివాస్ రెడ్డి, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పంచాయితీరాజ్ డైరెక్టర్ కు మహిళల అభినందనల వెల్లువ



చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 18: (మంగపేట) :రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ డైరెక్టర్ గా ఎంపిక అయిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుమ్మడి సోమయ్యకు గురువారం మంగపేట మండల మహిళ నాయకురాళ్లు శాలువాలు, పుష్ప గుచ్చాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చింతా చంద్రావతి, కమలాపురం కాంగ్రెస్ గ్రామ కమిటీ ఉపాధ్యక్షురాలు పోలసాని సరళా రాణి మాట్లాడుతూ కష్టానికి తగిన ఫలితం లభించిందని పార్టీని నమ్ముకున్న ఎవ్వరిని పార్టీ నిరాశపరచదని అన్నారు. అనంతరం స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆది రేణుక, అల్లాడి వైష్ణవి, అమ్మాయక్క మొదలైన మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు

## మొక్కల రాజశేఖర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, సింగరేణియన్, దేశ ప్రధాని నరేంద్ర మోదీ జయప్రశంసలు అందుకున్న మొక్కల రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష కురాలు నైనిక రజువా ఆయనకు మొక్కను అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది. నిరంత రంగా, క్రమం తప్పకుండా ప్రతిరోజూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న మొక్కల రాజశేఖర్ సేవలను పలువురు కొనియాడారు.అలాగే ఆయన వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న సభ్యులు మొక్కలు నాటి, మొక్కలను బహుమతిగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఆయనకు పద్మశ్రీ అవార్డు లభించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్ మాట్లాడుతూ "ప్రకృతి హరిత దీక్ష భావితరాలకు రక్ష. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రపంచ పర్యావరణాన్ని కాపాడాలి" అని విజ్ఞప్తి చేశారు.


## విద్యే మన తలరాతను మార్చుతుంది, మార్చుతోంది కూడా



అవును ఖచ్చితంగా మన తల రాతను మనం చదువుకున్న చదువులే మార్చుతుంటాయి. దానికి ప్రత్యక్ష ఉదాహరణ నేనే. అందుకే, విద్యకు విద్యే సాటి. దీనికి సాటి ఈ ప్రపంచంలోనే మరొటి లేదు. విద్యా రంగం పటిష్టంగా ఉంటేనే అభివృద్ధి గమనించబడుతూ భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది.
"చదువుకున్న వ్యక్తి - చదువులేని వ్యక్తి" 'చదువు గల సమాజం చదువు లేని సమాజం' ఈ రెండింటిని గూర్చి తగు విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతున్నాయి. ఒకసారి పరిశీలించండి. ఉదా! నేను అంతో ఇంతో చదివి, విలువలను ఆపాదించుకోవడం వల్లనే ఈ విధంగా వ్యాసాలు రాస్తూ..... మీలో కొంత అవగాహన పెంపొందించేలా తపిస్తున్నాను. మనం చదువుకున్న విద్య తలరాతను మార్చుతుంది. ఇది నగ్నసత్యం. అందుకే అన్నింటిలో విద్యకు మొదటి ప్రాధాన్యత అవసరం. ఇందులో రెండో ఆలోచనకు తావే లేదు. విద్య సత్యానికి, జ్ఞానానికి ప్రతిరూపంగా అందించబడాలి. పూర్వం నుంచే మన ప్రాచీనులు సత్యం గూర్చి, జ్ఞానం గూర్చి పరితపిస్తూ అన్వేషించే వారని స్పష్టమవుతోంది. అదే వారు చేసిన గొప్ప పుణ్య కార్యం. ఆనాడే మన పూర్వీకులు "తమసోమా జ్యోతిర్గమయా" అంటూ ప్రార్థించేవారు. అంటే ఆనాడే వారు తమ జీవితాల పట్ల సమగ్రమైన పద్ధతులను అవలంబించే వారని స్పష్టమవుతోంది. ఇదే పోకడ కొనసాగించబడితే విద్యారంగం ఇంకా బ్రహ్మాండంగా ఉండేది. విద్యారంగంలో ప్రగతి సాధించినా ఇంకా సాధించాల్సి ఎంతో ఉందిఏ సమాజం (దేశం) ప్రగతి అయినా ఆ సమాజం (దేశం) అందించే విద్యపైనే ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. అందుచేతనే విద్యారంగం సామాజిక వ్యవస్థలో అతి ముఖ్యమైన వ్యవస్థగా పేర్కొనబడింది. సమాజంలో అమలులో ఉండే, అమలు చేయబడే విద్యా విధానమే ఖచ్చితంగా సమాజ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మన విద్యా చరిత్రను ఒకసారి పరిశీలిస్తే..... ఆశ్చర్యంగా- నాగరికత గూర్చి ప్రపంచానికి ప్రథమ పాఠాలు నేర్పింది మన దేశమే. విజ్ఞాన శాస్త్రాలు కూడా ఏనాడో పరిచయం చేయబడ్డాయి. కీఎపూ 3వ శతాబ్దంలోనే అశోక చక్రవర్తి తన రాజ్యమంతా గొప్ప శాసనాలు వేయించారు. సదరు శాసనాల్లో ధర్మానికి సంబంధించినవే అతి ముఖ్యమైనవిగా ఉండటం గొప్ప విషయం. ఆర్యభట్టు, బ్రహ్మగుప్త, భాస్కరుడు, పతాంజలి మొదలగు మహానుభావులున్న చరిత్ర మనది. అలనాడే బౌద్ధుల కాలంలో పేరొందిన తక్షశిల, నలంద విశ్వవిద్యాలయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించడంతో, పాహియాన్, హుయాన్ త్సాంగ్ వంటి విదేశీ పండితులు మన దేశాన్ని దర్శించినట్లు చరిత్ర చెబుతోంది. దీనికి ప్రధాన ఏకైక కారణం- విద్యారంగంపై తగు దృష్టి సారించడమే!
అలనాడు విద్యారంగంలో ముఖ్య ధృవాలైన ఉపాధ్యాయుడు



మరియు విద్యార్థి తమ తమ విద్యుక్త ధర్మాలను చిత్తశుద్ధితో, ఖచ్చితంగా, నీతి నిజాయితీలతో నిర్వహించేవారు. అంటే విద్యార్థుల్లో జ్ఞాన తృష్ణ, ఇంకా నేర్చుకోవాలనే జిజ్ఞాస ఉండేది. అదే రీతుల్లో ఉపాధ్యాయులంతా (గురువు) తమ తమ విద్యుక్త ధర్మాలను ఖచ్చితంగా నిర్వహిస్తూ, విద్యార్థుల జ్ఞాన తృష్ణను తీర్చేవారు. సత్యమార్గంలో నిస్వార్థంతో తమకున్న సర్వజ్ఞానాన్ని బదలాయించేవారు. ఈ మేరకు ప్రతి విషయంలోనూ విద్యార్థులు గురువులను ఆదర్శంగా తీసుకునేవారు. గురువే దైవంగా, గురువే సర్వస్వంగా, గురువు గారిని గౌరవిస్తూ, గురువు ఆజ్ఞలను ఖచ్చితంగా పాటించేవారు. దీంతో గురు - శిష్య సంబంధాలు పవిత్రంగా వర్ధిల్లుతుండేవి. విద్యాభ్యాసంలో... "ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకుతూ, ధర్మాన్ని ఆచరిస్తూ, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించు" అనేదే ప్రధాన లక్ష్యంగా ఉండేది. ఈ ఆచరణతో సమాజంలో మాదిరికర జీవితాలు, ఆరోగ్యవంతమైన సమాజం గమనించబడేది. ఎల్లప్పుడూ సత్యాన్ని పలుకుతూ, ధర్మాన్ని నెరవేరుస్తూ, ఎవరి బాధ్యతలను వారు నిర్వహిస్తే ఇక సమస్యలు ఎందుకు%శీ%టాయి? చెప్పండి. సమాజంలో ఎవరికి నిర్దేశించిన పనులను, బాధ్యతలను ఎవరికి వారు సమర్ధవంతంగా నిర్వహిస్తే ఇక సమస్యలకు, ఇబ్బందులకు చాన్సే లేదు. అభివృద్ధి గమనించబడి తీరుతుంది. ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నిర్వర్తించకపోవడమే నేడు సకల సమస్యలకు హేతువుగా ఉంటోంది.అలనాడు విద్యార్థులు తమ విద్యార్జన కాలంలో తప్పనిసరి నియమాలను తూచా పాటించేవారు. తమ చర్యల ద్వారా గురువును మెప్పిస్తూ తమకు విద్యపై ఆసక్తి ఉన్నదనే విషయాన్ని రుజువు చేసుకునేవారు. వారి క్రియలను గమనించి, గురువు సంతృప్తినోంది విద్యను అందించేవారు. సత్ప్రవర్తన,శీల నిర్మాణం, నైతిక విలువలు ప్రధాన అంశాలుగా భోధించబడేవి. గురు శిష్యుల మధ్య అతి పవిత్రమైన అన్యోన్య సంబంధాలు ఉండేవి. విద్యార్థి తన గురువును అత్యంత భక్తిశ్రద్ధలతో గౌరవించేవారు. గురువు ఆజ్ఞనే వేదవాక్కుగ పాటించేవారు. గురువే సర్వసంగా, కడు భక్తి శ్రద్ధలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించేవారు. అదే రీతుల్లో గురువుగారు కూడా తమ స్వంత పిల్లల వలె తమ శిష్యుల పట్ల అమితమైన ప్రేమానురాగాలను ప్రదర్శించేవారు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే- గురువు తమ శిష్యులను పరిపూర్ణ వ్యక్తులుగా తయారుచేయడానికి ఏదీ దాచకుండా, ఆశించకుండా, నిస్వార్థంతో తమకున్న జ్ఞానాన్ని పంచేవారు. తగు మార్గదర్శకం చేసేవారు. ఈ విధంగా గురు శిష్యుల సంబంధం చిరకాలం, నిరంత రం కొనసాగేది. ఆనాడు, గురువు పట్ల వినయం, విధేయత కలిగి ఉంటూ గురువునే దైవంగా భావిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో విద్యనభ్యసించేవారు అలాగే, గురువు కూడా తన వృత్తికి పూర్తి న్యాయం చేస్తూ వృత్తి ధర్మాన్ని ఖచ్చితంగా నిర్వర్తించేవారు. ఆత్మ నిగ్రహం అనేది ప్రధానమైనదిగా ఉండేది. ఇక, మరి ప్రస్తుత పరిస్థితులు? ఒకసారి పరిశీలించండి. నిశితంగా ఆలోచించండి!ఈ మేరకు పునాది స్థాయి చదువులే పటిష్టంగా, పద్ధతిగా, కరెక్టుగా అందించబడాలంటూ స్పష్టం చేయబడుతోంది. ఎన్ని పథకాలు, ఎన్ని కమీషన్లు, ఎన్ని స్కీంలు వచ్చినా..... విద్యారంగం పర్ఫెక్ట్ గ నిర్వహించబడాలి. విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడాలి. అప్పుడే బ్రహ్మాండమైన భవిష్యత్తు గోచరిస్తుంది. విద్యారంగానికి, మరియు ముఖ్యంగా ప్రాథమిక విద్యకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే ప్రాథమిక విద్య- వ్యక్తిలోని శక్తిసామర్థ్యాలను బహిర్గతం చేస్తూ అతని సాధనా శక్తిని మెరుగుపరుస్తూ స్వేచ్ఛగా జీవించే మార్గాన్ని సుగమం చేస్తుంది. విద్యా పునాదులే పటిష్టంగా ఉంటే ఇక దానిపై ఎన్ని అంతస్తులైనా ధృఢంగా ఆపై నిర్మించవచ్చు. ప్రాథమిక విద్యపై పూర్తి దృష్టి సారిస్తే, సంపూర్ణ అక్షరాస్యత, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, పేదరిక నిర్మూలన, చైతన్యం వంటివి గమనించబడుతూ, సమాజంలో అర్థత గల మనుష్యులు గమనించబడుతుంటారు. దీంతో స్థిరత్వం గమనించబడుతుంది. ఎప్పుడైతే స్థిరత్వం గమనించబడుతుందో ఇక ఆలోచన విధానాలు మెరుగుపడుతూ, అర్థవంతమైన జీవితాలను కలిగి ఉంటారు. వాస్తవాలకు దగ్గరగా జీవిస్తూ వివేచనతో బ్రతుకుతూ, సహనం, సామరస్యం, సర్దుబాటు, తథాభూతులను కలిగి ఉంటూ ఆదర్శప్రాయులుగా గమనించబడతారు. ఇదే విద్యకు ఉన్న గొప్పతనం అందుకే, విద్యకు విద్యే సాటి. దానికి సాటి ఇలలో మరోటి లేదు. విద్యను స్వంతం చేసుకుంటూ అఖండమైన భవిష్యత్తులను సాధించాలి. విద్యే తలరాతను మార్చివేస్తుంది. అగ్ర భాగంలో ఉంచుతుందని అందరూ గమనించాలి.



డాక్టర్ ఎం. ప్రభు దయాల్-కొత్తగూడెం
పూర్వ ప్రిన్సిపాల్, గిరిజన విద్యాకళాశాల- భద్రాచలం
మాజీ సినేట్ మెంబర్, కాకతీయ యూనివర్సిటి- వరంగల్
జీవిత సభ్యుడు- ఐఏటిఈ

## ఇల్లందు నియోజకవర్గాన్ని పర్యటించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత





చర్చ, ఇల్లందు : ఇల్లందు పట్టణాన్ని పర్యటించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, హజ్రత్ నాగుల్ మీరా దర్గా విషయంలో ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వాళ్లు చాలా ఇబ్బంది పెడుతున్నారు. ఇక్కడ జరిగే ఉర్సు కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కానీ కనీస సౌకర్యాలు కూడా కల్పించటం లేదు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు దర్గా అభివృద్ధికి కృషి చేయాలి. ఇక్కడే రాముల వారి ఆలయం కూడా ఉంది. ఇక్కడకు వచ్చిన వారంతా రాముల వారి ఆలయం, దర్గాను సందర్శిస్తున్నారు. హిందూ, ముస్లింల ఐక్యతకు ఇది చక్కని ఉదాహరణ. దర్గా వద్ద పర్మినెంట్ స్ట్రక్చర్ లు కట్టుకునేందు మంత్రులు పర్మిషన్ ఇవ్వాలి. ఆడవాళ్లకు ఇబ్బంది లేకుండా సౌక్యర్యాలు ఏర్పాటు చేయాలి. మిషన్ భగీరథ పైప్ లైన్ ద్వారా ఇక్కడ నీళ్లు ఇచ్చే ఏర్పాట్లు చేయాలి. కొత్తగూడెం పర్యటనలో భాగంగా ఇల్లందులో చాలా మంది సమస్యలు చెప్పారు. రెండు రోజుల పాటు జిల్లాలో ప్రజల సమస్యలు తెలుసుకుంటాం. జనం బాటలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం. సర్పంచ్ ఎన్నికల్లో అసలు గుర్తులే ఉండవు. పరిచయాలను, మనిషిని చూసి ఓట్లు వేస్తారు. గ్రామస్తులకు ఎవరు పనిచేస్తారో వారిని ప్రజలు గెలిపించుకుంటారు. గుర్తులు లేకుండా ఉన్న ఎలక్షన్స్ ను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.
దీనికి కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ వాళ్లు మేము గెలిచామంటూ గొప్పలకు పోతున్నారు. సర్పంచులు వచ్చాక అయిన సరే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నా. లేదంటే ప్రజలే తిరగబడే పరిస్థితి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు మర్చి పోయింది.
పెన్షన్లు పెంచలేదు. ఫ్రీ కరెంట్ వస్తలేదు. భర్త చనిపోయిన వారికి పదేళ్లుగా పెన్షన్ రావటం లేదు. వారిని చూస్తే చాలా బాధగా ఉంది. వారికి ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి. సర్పంచ్ ఎన్నికలను పక్కన పెట్టి ప్రజల కోసం పనిచేయాలని రెండు పార్టీలకు సూచిస్తున్నాను అని తెలిపారు.

## స్పీకర్ నిర్ణయం సరైంది కాదు - జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

చర్చ కొత్తగూడెం :బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే లు కాంగ్రెస్ పార్టీలో మారినప్పటికీ పార్టీ మారిన ఎమ్మెల్యే పై అనర్హత వేయకుండా సరైన ఆధారాలు లేవని స్పీకర్ చెప్పడం విడ్డూరంగా ఉందని, స్పీకర్ నిర్ణయం సరైంది కాదని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేసేలా ఉందని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో జనం బాట కార్యక్రమంలో భాగంగా ప్రధాన రోడ్ పై జెండాను ఎగురవేసి, అనంతరం స్నేహలత - సంధ్య లత అనాథ శరణాలయం వృద్ధులతో మాట్లాడారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యాన్ని పరిహరించేలా ఉందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి అధికారం కోసం పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. అధికారమే పరమావధి ప్రజలను మోసం చేయడం కరెక్ట్ కాదన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అనేక సమస్యలు ఉన్నాయనే విషయాన్ని వైద్యులు, నర్సింగ్, ఆసుపత్రి పరిశుధ్య సిబ్బంది తన దృష్టికి తీసుకు వచ్చారని చెప్పారు. ఆసుపత్రిలో కార్డియాలజీ, నెఫ్రాలజీ విభాగాలను ఏర్పాటు చేయాలని, రోగుల కోసం అదనపు బెడ్లు తో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలను సకాలంలో ఇవ్వాలని కోరారు. సింగరేణి ప్రైవేటీకరణ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఇది కార్మిక, తెలంగాణ సమాజానికి మంచిది కాదన్నారు. వెంటనే సింగరేణి బొగ్గు బ్లాక్ లను



ప్రైవేటీకరణ విరమించుకుని ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎందుకంటే? మెడికల్ బోర్డ్ నిర్వహించకపోవడం వల్ల వారసత్వ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతి నెల బోర్డు నిర్వహించాలని జాగృతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం వల్లే బోర్డు ను నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించిందని ప్రజల పక్షాన ఎప్పుడూ పోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉంటామని చెప్పారు. జనం బాట కార్యక్రమంలో జిల్లా సమస్యలను పూర్తిగా తెలుసుకొని సమస్యల పరిష్కారానికి ఒక ప్రణాళిక తయారు చేసుకుంటాను అని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ముగిశాయని ఒక మహిళలకు ఇస్తానన్న రూ.2,500, రైతుబంధు ఖాతాలో వేయాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్క మహిళకు బతుకమ్మ చీర ఇవ్వాలన్నారు. కవిత జిల్లా పర్యటన సందర్భంగా జాగృతి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి. వీరన్న, నియోజకవర్గ ఇంచార్జి నమ్మి జగదీష్, సింగరేణి ఇంచార్జీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.


శుక్రవారం,
డిసెంబర్ 19, 2025

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ గ్రామ సర్పంచులు మర్యాదపూర్వకంగా మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డిని వారి నివాసంలో కలిశారు





**పెద్దపల్లి. చర్చ.. ప్రతినిధి..** పెద్దపల్లి నియోజకవర్గ సుల్తానాబాద్ మండలంలోని గట్టపల్లి, కానుకుల గ్రామాలకు నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ గ్రామ సర్పంచులు మర్యాదపూర్వకంగా మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి గారిని వారి నివాసంలో కలిశారు.ఈ సందర్భంగా గట్టపల్లి గ్రామ సర్పంచ్ దేవేందర్ గారిని, కానుకుల గ్రామ సర్పంచ్ కర్రీ కుమారస్వామి కవిత గారిని శాలువాలతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో సర్పంచులు నిబద్ధతతో పని చేయాలని, బిఆర్ఎస్ పార్టీ విధానా లను గ్రామ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి గారు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు,సుర శ్యామ్, గట్టపల్లి మాజీ సర్పంచ్,మైలారం నారాయణ ,శంకర్, వార్డ్ నెంబర్ లు, BRS నాయకులు ఉన్నారు


# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషితో గ్రామ సర్పంచుల గెలుపు





**చర్చ:- హుస్నాబాద్:** పట్టణంలో గురువారం రోజున క్యాంప్ కార్యాలయంలోమంత్రి పొన్నం ప్రభాకర్,రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖనూతనంగా గెలిచిన సర్పంచ్ లు ,ఉప సర్పంచ్ లు ,వార్డు సభ్యులకు నా పక్షాన , ముఖ్యమంత్రి గారి పక్షాన , పీసీసీ పక్షాన అభినందనలు శుభాకాంక్షలు హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం 173 సర్పంచ్ లు ఉంటే.. సైదాపూర్ మండలంలో 2 గ్రామాలకు ఎన్నికలు కాలేవు మొత్తం 171 గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు జరిగాయి171 సర్పంచ్ లకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ సొంతగా 108 మంది గెలిచారు.11 మంది ఇండిపెండెంట్ లు కాంగ్రెస్ లోకి వస్తున్నారు.నియోజకవర్గంలో మొత్తం 171 గ్రామ పంచాయతీ లకు 119 మంది కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు అవుతున్నారు 40 , బీజేపీ 10 , సీపీఐ 2 గ్రామ పంచాయతీ లు గెలిచాయిసర్పంచ్ లుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి తో విజయం సాధించారు.ప్రజా పాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆశీర్వదించారుఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్, రైతు భరోసా,రైతు రుణమాఫీ,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉద్యోగాల భర్తీ ఇలా ఎన్నో పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందిహుస్నాబాద్ నియోజకవర్గంలో 80 శాతం కి పైగా పోలింగ్ జరిగిన గ్రామాలకు అభినందనలుఈ మధ్య జూబ్లీహిల్స్ లో జరిగిన ఎన్నికల్లో సినీ యాక్టర్లు ,మొత్తం అధికార యంత్రంగా కదిలిన అక్కడ ఇంత పోలింగ్ కాలేకపోయిందిగ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రజాస్వామ్యం మీద విశ్వాసం తో ఓటింగ్ పెద్ద ఎత్తున తరలించారు గ్రామాల్లో వృద్ధులు ఓటు వేస్తేనే ఉన్నట్టు లేకపోతే లేనట్టు అనే విధంగా వ్యవహరించారు అందుకే పెద్ద ఎత్తున ఓటింగ్ జరిగింది హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్య,వైద్యం,ఉపాధి కల్పన , వ్యవసాయం , టూరిజం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.ప్రజలు ప్రజా సమస్యల పై వచ్చిన స్థానిక సర్పంచ్ లు మీ స్థాయిలో పరిష్కారం చేసే విధంగా ఉండాలిహుస్నాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీ లు ఉంటే 13 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ,ఇద్దరు ఇండిపెండెంట్ లు గెలిచారు.. వారు కాంగ్రెస్ లోనే ఉన్నారు ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 15 స్థానాలు గెలిచింది..రెండు స్థానాలు గెలిచింది.అక్కన్న పేట మండలంలో 38 గ్రామ పంచాయతీ లకు 27 కాంగ్రెస్ పార్టీ గెలిచింది.. ఇద్దరు ఇండిపెండెంట్ లు మొత్తం కాంగ్రెస్ 29, , 7, బీజేపీ 1 గెలిచింది.కోహెడ లో 27 గ్రామ పంచాయతీ లకు లో 17 కాంగ్రెస్ పార్టీ గెలిచింది ఒకరు ఇండిపెండెంట్ కలుపుకొని కాంగ్రెస్ 18 గెలిచింది 5, బీజేపీ 4 గెలిచింది.చిగురు మామిడి లో 17 గ్రామ పంచాయతీ లకు 7 కాంగ్రెస్ పార్టీ ఒకటి ఇండిపెండెంట్ గెలిచింది.. 8 %ఎతీం%, ఒకటి బీజేపీ గెలిచింది.సైదాపూర్ మండలంలో 27 గ్రామ పంచాయతీ లకు లో 19 కాంగ్రెస్ పార్టీ గెలిచింది.. 7 ఒకటి బీజేపీ గెలిచిందిభీమదేవరపల్లి లో 25 సర్పంచ్ లకు 15 కాంగ్రెస్ పార్టీ ముగ్గురు ఇండిపెండెంట్ గెలిచారు.. మొత్తం 18 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కాగా 4 ,3 బీజేపీ గెలిచిందిఎలుకతుర్తి లో 20 గ్రామ పంచాయతీ లు ఉంటే 10 కాంగ్రెస్ ఇద్దరు ఇండిపెండెంట్ లు గెలవగా కాంగ్రెస్ 12 కాగా.. 7 ఒకటి సీపీఐ గెలిచిందిగెలిచిన సర్పంచ్ లకు, ఉప సర్పంచ్ లకు ,వార్డు సభ్యులకు శుభాకాంక్షలునియోజకవర్గం ను అన్ని గ్రామాలను అభివృధి చేస్తాం అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తాం.

# పంచాయితీ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్ ఘన విజయం




**నాగర్ కర్నూల్, డిసెంబర్ 18:** ట్రాన్స్ జెండర్ అంటే.. గృహప్రవేశాలు, శుభకార్యాలలో, రోడ్లపై వాహనాలు ఆపి డబ్బు లు వసూలు చేస్తారని అంతా భావిస్తారు. కానీ, తాము ప్రజా సేవలోనూ ముందుంటామని నిరూపిస్తున్నారు ఈ ట్రాన్స్‌జెండర్. అవును.. ఈ మేరకు ఎన్నికల్లో నిలవడమే కాకుండా.. జయకేతనం ఎగురవేశారు. మరి ఈ ఘటన ఎక్కడ జరిగింది.. ఎవరు విజయం సాధించారు.. పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలంలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా చారకొండ గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 11వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసిన ట్రాన్స్ జెండర్ నందిని ఎన్నిక య్యారు. ఈ పంచాయతీలో 12 వార్డులకు గాను 11వ వార్డుకు ఎస్సీ జర్నరల్ కేటాయించారు. ఈ వార్డు నుంచి కాంగ్రెస్ మద్దతుతో నందిని, బీఆర్ఎస్ నుంచి పెద్దాపూర్ వెంకటయ్య, బీఎస్పీ నుంచి మల్లేష్ పోటీ పడ్డారు.ఈ వార్డులో మొత్తం 372 ఓటర్లు ఉన్నారు. బుధవారం వెల్లడైన ఫలితాలలో నందిని.. బీఆర్ఎస్ అభ్యర్థిపై 64 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆమె గెలుపుపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నందిని.. ట్రాన్స్ జెండర్ మహిళలు ఓన్లీ నూతన గృహప్ర వేశాలప్పుడు, శుభకార్యాలలో డబ్బులు వసూలు చేస్తారనే భావన ప్రజల్లో ఉంటుంది. కానీ, డబ్బులు వసూళ్లకే పరిమితం కాకుండా అన్నిట్లో మేమున్నామని చాటిచెప్పాలనే తన లక్ష్యమన్నారు. తనను ఆదర్శంగా తీసుకొని ట్రాన్స్‌జెండర్ మహి ళలు అన్నింట్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నా సేవలు గుర్తించి అవకాశం కల్పించిందని.. తనను గెలిపించిన గ్రామ ప్రజలకు నందిని కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజలకు అన్నివేళలా అందుబా టులో ఉంటూ.. గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడతానన్నారు.

# రూ.15 వేల కోట్ల విలువైన భూమి తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట



**హైదరాబాద్ :** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూమిపై వివాదం కొనసాగుతోంది. ఈ భూమిపై హక్కులు తమవేనని నిజాం, సాలార్‌జంగ్, మీరాలం వారసులం అంటూ కొంతమంది సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారుగతంలో పిటిషన్లు వేసిన 260 మందికి హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది(. దీంతో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ తర్వాత ద్విసభ్య ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. అది పూర్తిగా అటవీ భూమి అని.. దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు ఉన్నాయని తేల్చి చెప్పింది.ఆ భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కులు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది తీర్పు వెలువడిన 8 వారాల్లో ఆ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్ కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం సూచించింది. దీంతో 2 దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదం ఓ కొలిక్కి వచ్చింది.

# ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో నియోజకర్గ ప్రజలకు చెప్పాలి



**కొండాపూర్, డిసెంబర్ 18 :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఏ పార్టీలో ఉన్నాడో తేల్చి చెప్పాలని నియోజకవర్గ ప్రజలతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు కోరుతున్నాయి. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి రుజువులు లేదంటూ స్పీకర్ తేల్చడంతో నియోజకవర్గ ప్రజల్లో మరింత అనుమానం మొదలయింది. గురువారం చందానగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ నాయయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మినిమం వేజేస్ చైర్మన్ సామ వెంకట్‌రెడ్డితో కలిసి నవతారెడ్డి మాట్లాడారు.స్పీకర్ నిర్ణయంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాదని బహిర్గతమయిందన్నారు. మరి ఎమ్మెల్యే ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాను అనుకుంటే ఈనెల 21వ తేదీన కేసీఆర్ అధ్యక్షతన జరిగే సీఎల్పీ ప్లీనరీ సమావేశానికి గులాబీ కండువా కప్పుకొని హాజరుకావాలన్నారు. ఒకవేళ హాజరు కాకపోతే, ప్రజలు ఆయనను పార్టీలో ఉన్నారని ఎలా నమ్ముతారని వారు ప్రశ్నించారు. గాజులరామారం సర్వే నంబర్ 307, శంషీగూడ సర్వే నంబర్ 57 లోని భూములను కాపాడుకోవడానికే ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరినట్లు ఆరోపించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ..

# మూడోసారి కస్టడీలోకి ఐబొమ్మ రవి





**హైదరాబాద్, డిసెంబర్ 18:** ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మంది రవిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మూడోసారి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. మూడు కేసుల్లో 12 రోజుల పాటు కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఒక్కో కేసులో నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇచ్చింది న్యాయస్థానం. కోర్టు అనుమతి మేరకు ఈరోజు (గురువారం) చంచల్‌గూడా జైలు నుంచి ఐబొమ్మ రవిని సైబర్ క్రైమ్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు.ఈ కేసుకు సంబంధించి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు ఇప్పటికే ఎనిమిది రోజుల పాటు రెండు సార్లు కస్టడీలో తీసుకుని విచారించారు. రవిపై మొత్తం ఐదు కేసులు నమోదు చేశారు. పైరసీ లింకులు, బెట్టింగ్ యాప్స్ నుంచి పొందిన డబ్బులు, ఆర్థిక లావాదేవీలపై పోలీసులు ప్రశ్నిస్తున్నారు. కాగా.. రెండు సంవత్సరాల క్రితం పట్టుకోండి చూద్దాం అంటూ ఏకంగా పోలీసులకే సవాల్ విసిరాడు ఐ బొమ్మ రవి. దీంతో ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఎట్టకేలకు రవిని అరెస్ట్ చేసి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.రవితోనే ఐబొమ్మ, బప్పం వెబ్ సైట్లను బ్లాక్ చేయించారు. ఈకేసులకు సంబంధించి రవిని మరింతగా విచారించాలని పోలీసులు నాంపల్లి కోర్టును ఆశ్రయించగా... అందుకు న్యాయస్థానం అంగీకరించింది. రవిని మరోసారి పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మూడు కేసుల్లో 12 రోజుల పాటు ఐబొమ్మ రవిని సైబర్ క్రైమ్ పోలీసులు విచారించనున్నారు.

# నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు పోలీసులు అలర్ట్





**హైదరాబాద్, డిసెంబరు18 :** హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు గుర్తుతెలియని వ్యక్తి పంపిన బాంబు బెదిరింపు మెయిల్ తీవ్ర కలకలం రేపింది. (గురువారం) మధ్యాహ్నం 2 గంటలకు కోర్టు పేలిపోతుందని మెయిల్‌లో పేర్కొనడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యి కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను ద ృష్టిలో పెట్టుకుని బాంబ్ స్క్వాడ్‌ను హుటాహుటిన అక్కడికి పంపించారు.న్యాయస్థానం చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్త ృతంగా తనిఖీలు ప్రారంభించారు. భద్రతా చర్యల్లో భాగంగా కోర్టు పరిసరాల్లో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను బయటకు తరలించారు. కోర్టు ప్రాంగణం మొత్తం ఖాళీ చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అనుమానాస్పద వస్తువుల కోసం కోర్టులను నిశితంగా పరిశీలిస్తూ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు కొనసాగిస్తోంది. పోలీసు అధికారులు మెయిల్ పంపిన వ్యక్తి వివరాలు గుర్తించేందుకు సైబర్ నిపుణులతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, భద్రతా చర్యలు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కూడా ఇటీవల వరుసగా బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. వీటిపై పోలీసులు ద ృష్టి సారించారు. కాల్స్, మెయిల్స్ ఎవరు పంపిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గరువుతున్నారు.

# గండిపేట చెరువులో పాడు పనికి యత్నం




మనుషుల్లో స్వార్థం పెరిగిపోయింది. ప్రాణాలు నిలుపుతున్న ప్రక ృతినే పాడు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దారుణమైన పనులకు తెగబడుతున్నారు. పట్టణాలలోని కొంతమంది చేస్తున్న పనులు చూస్తే 'వీళ్లసలు మనుషులేనా?' అనిపించకమానదు. పర్యావరణాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నాట్లుగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటన ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. గండిపేట వాసుల దప్పిక తీరుస్తున్న గండిపేట్ చెరువులో ఓ వ్యక్తి సెప్టిక్ ట్యాంకర్ ద్వారా మలమూత్ర వ్యర్థాలను వదిలే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు వాటర్ బోర్డు అధికారులు ఫిర్యాదు చేశారు.సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే..(బుధవారం) సింగరేణి కాలనీ, సైదాబాద్‌కి చెందిన శివ అనే వ్యక్తి గండిపేట్ చెరువులో సెప్టిక్ ట్యాంకర్ ద్వారా మలమూత్ర వ్యర్థాలను వదిలే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు వాటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. ఓ సెప్టిక్ ట్యాంకర్ హిమాయత్ నగర్ గ్రామంలోని ఎఫ్టీఎల్ పాయింట్ నెంబర్ 428 వద్ద ఉన్న ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్‌లో మలమూత్ర వ్యర్థాలను పోస్తూ కనిపించింది. పోలీసులు శివను పట్టుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

# తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై కేఏ పాల్ ఆగ్రహం



**ఢిల్లీ, డిసెంబర్ 18:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తాజా నిర్ణయంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను తోసిపుచ్చిన స్పీకర్, 'ఫిరాయింపు ఆధారాలు లేవు'అనడం విడ్డూ రంగా ఉందని పాల్ వ్యాఖ్యానించారు.పార్టీ ఫిరాయించిన వారిని బిఆర్ఎస్ సభ్యులుగానే కొనసా గిస్తున్నట్టు స్పీకర్ రూలింగ్ ఇవ్వడం ఆందోళన కలిగించిందని కేఏ పాల్ అన్నారు.'బిఆర్ఎస్ ఎమ్మె ల్యేలు బహిరంగంగా కాంగ్రెస్‌లో చేరి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా స్పీకర్ ఫిరాయింపు జరగలేదంటున్నారా? అని పాల్ ప్రశ్నించారు.'ఇది సిగ్గుచేటు! స్పీకర్‌కు చట్టం తెలుసా? సుప్రీంకోర్టు మీద గౌరవం లేదా?' అని పాల్ ప్రశ్నించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది తానేనని.. ఈ అంశంపై పోరాటం కొనసాగిస్తానని పాల్ ఢిల్లీలో చెప్పారు.

# వంశీకి ఊహించని షాక్ మరో కేసు నమోదు



**విజయవాడ, డిసెంబరు18 :** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊహించని షాక్ తగిలింది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వల్లభనేని వంశీపై (గురువారం) కేసు నమోదైంది. సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేశారు. 2024లో జులైలో తనపై వంశీ ఆయన అనుచరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీతో సహా మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.కాగా, సత్యవర్ధన్‌ను వంశీ అండ్ కో కిడ్నాప్ చేసి దాడి చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో వల్లభనేని వంశీ జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. 2023లో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. అయితే ఈ దాడిలో ప్రధాన సాక్షిగా సత్యవర్ధన్ ఉన్నారు. ఈ ఘటనలో ఆయన ఇచ్చిన ఫిర్యాదే కీలకంగా మారింది. ఈ క్రమంలో సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే వల్లభనేని వంశీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. 2024 జులైలో తనపై వంశీ అండ్ కో దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో సత్యవర్ధన్ తెలి పారు. వంశీతో పాటు మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

# పీపీపీ విధానంపై వైసీపీ ద్వంద వైఖరి : టీడీపీ నాయకుడు పట్టాభి ఆరోపణ



**అమరావతి :** ప్రభుత్వ మెడికల్ కళాశాలలనుపీపీపీ ( పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) విధానంలో కొనసాగించాలని నాడు పార్లమెంట్ కమిటీలో సంతకాలు చేసిన వైసీపీ సభ్యులు నేడు వ్యతిరేకిస్తున్నారని టీడీపీ నాయకుడు పట్టాభిరామ్ మండిపడ్డారు. గురువారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా పీపీపీ విధానానికి మద్దతు తెలుపుతూ కమిటీలో పలు జాతీయ పార్టీలతో పాటు వైసీపీ సభ్యులు గురుమూర్తి కూడా విషయాన్ని ఆయన స్క్రీన్‌లో ప్రదర్శించారు. పట్టాభిరామ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట లేనప్పుడు మరో మాట మాట్లాడడం జగన్‌కు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.17 మెడికల్ కళాశాల నిర్మాణానికి సుమారు 8 వేల కోట్లు మంజూరు చేశారని, దురదృష్టవ శాత్తు ప్రభుత్వం కోల్పోవడంతో ఆ నిధులు కాజేయడానికి అవకాశం లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.పీపీపీ విధానం వల్ల పేద రోగులకు, మెడికల్ విద్యను చదువుకోవాలనే ఆశపడే పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ఇప్పటికి వైసీపీ హయాంలో ప్రారంభించిన పనులు మొండి గోడలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేసిన కోటి సంతకాలు దొంగ సంతకాలనేనని విమర్శించారు. వైసీపీ హయాంలో 108, 104 అంబులెన్స్‌లను పీపీపీ విధానంలో అరబిందో కంపెనీకి అప్పగించారని గుర్తు చేశారు. మెడికల్ కళాశాలలకు ప్రభుత్వ మెడికల్ కళాశాల అనే పేరుంటుందని వెల్లడించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ప్రజాదర్బార్‌లో మంత్రి కొండపల్లి




**విజయనగరం, డిసెంబర్ 18:** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని గంట్యాడ మండలంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌లో సామాన్య ప్రజల నుంచి వస్తున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అన్నారు. అధికార యంత్రాంగం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేయాలని తెలిపారు.ప్రజల దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్యహించటం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి 124 అర్జీలు వచ్చాయన్నారు. రెవిన్యూ, విద్యుత్, పెన్షన్లు, ఉపాధి అవకాశాల గురించిన అర్జీలు ప్రజలు సమర్పించినట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి వాటికి పరిష్కారం చూపాలన్నారు.ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు కార్యాలయ సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# తిరుమలలో అన్నాడీఎంకే పోస్టర్ల ప్రదర్శన



**తిరుమల :** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల లో శ్రీవారి ఆలయం ఎదుట నిబంధనలకు విరుద్ధంగా అన్నాడీఎంకే పోస్టర్ల ప్రదర్శన వివాదస్పదమవుతుంది . ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని టీటీడీ ప్రకటించింది. ఇటీవల తమిళనాడుకు చెందిన భక్తులు అన్నా డీఎంకేకు పోస్టర్లను ప్రదర్శించిన వీడియో సామాజిక మధ్యమాల్లో వైరల్ అయ్యాయి.తిరుమలలో రాజకీయ ప్రచారాలు, రాజకీయ చిహ్నాల ప్రదర్శన నిషేధం కాగా తమిళ భక్తులు నిబంధనలు విరుద్ధానికి పాల్పడ్డారని టీటీడీ అధికారులు ఖండించారు. పోస్టర్ ప్రదర్శించిన తమిళ భక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రూటీన్‌కు భిన్నంగా కలెక్టర్ల కానారెన్స్




**అమరావతి, డిసెంబర్ 18:** 5వ కలెక్టర్ల కానారేన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త విధానాన్ని అవలంభించారు. వివిధ జిల్లాల్లో కలెక్టర్లు అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఆయా జిల్లాల కలెక్టర్లతోనే సీఎం ప్రజెంటేషన్ ఇప్పించారు. ఆరు జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన కొన్ని ప్రాజెక్టులు దేశానికే ఆదర్శంగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. రోటీన్‌గా కాకుండా ప్రజలకు ఉపయో గపడేలా కలెక్టర్ల కానారేన్సులో చర్చ జరిగినందుకు ఆనందంగా ఉందన్నారు.జిల్లాల్లో అత్యుత్తమ విధానాల ద్వారా సేవలందిస్తున్న కలెక్టర్లను అభినందించారు. వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి ప్రజలకు ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలు, కార్యక్రమాలతో రావాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారుకలెక్టర్లు ఇచ్చిన ప్రజెంటేషన్స్ ఇవే.వివిధ అంశాలపై అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.విద్యార్థుల్లో ప్రతిభను ప్రొత్సహించేలా రూపొందించిన ప్రాజెక్ట్ నిర్మాణ్ గురించి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వివరించారు.విద్యార్థులు పరిశుభ్రత, హైజినిక్ కండిషన్స్ పాటించేలా రూపొందించిన ముస్తాబు కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రజెంట్ చేశారు.నాటుసారా తయారీదారుల జీవితాల్లో మార్పు తెస్తూ.. వారిని మైక్రో ఎంటర్ ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేలా రూపొందించిన ప్రాజెక్ట్ మార్పు కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ ప్రజెంట్ చేశారు.రైతుల్లో సాధికారత, ఆర్థిక లబ్ధి, వ్యవసాయంలో ఉత్తమ విధానాల పాటించేలా రూపొందించిన ఛాంపియన్ ఫార్మర్స్ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా హిమాన్షు శుక్లా వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్నం భోజనంలో అందించేందుకు ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్లపై కడప కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ప్రజెంటేషన్ ఇచ్చారు.రెవెన్యూ రికార్డుల ట్యాంపర్ చేయకుండా చేపట్టిన డిజిటలైజేషన్ విధానం, ఏఐ వినియోగంపై రూపొందించిన ప్రాజెక్టును అనంతపరం జిల్లా కలెక్టర్ ఆనంద్ ప్రజెంట్ చేశారు.

# అందుకే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాం



**నెల్లూరు, డిసెంబర్ 18:** సంఖ్యా బలం ఉండటంతో మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ మేయర్‌గా డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా రూప్‌కుమార్‌కు ఎమ్మెల్యే కోటంరెడ్డి, కార్పొరేటర్లు, నేతలు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవిశ్వాసం పెట్టిన తర్వాత స్రవంతి రాజీనామా చేశారని.. రాజీనామాను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. కౌన్సిల్ మీటింగ్‌లో కూడా సభ్యులు ఆమె రాజీనామాను ఆమోదించారన్నారు.కొత్త మేయర్ వచ్చే వరకు ఇన్‌ఛార్జి మేయర్‌గా రూప్ కుమార్ ఉంటారని... ఆయన కార్పొరేషన్‌ను అన్ని విధాలుగా అభివ ృద్ధి చేయాలని కోరారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో నూటికి నూరు శాతం గెలిచేలా పనిచేస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.చట్టప్రకారమే కొత్త మేయర్ ఎన్నిక: రూప్ కుమార్అవిశ్వాసంతో తమకు సంబంధం లేదని వైసీపీ జిల్లా నేతలు చెబితే... ఓ కమెడియన్ వచ్చి హంగామా చేశారని ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్ కుమార్ అన్నారు. తోలుబొమ్మలాటలో కేతుగాళ్లాగా వచ్చారంటూ వ్యాఖ్యలు చేశారు. కిక్ ఉండాలంటూ కొందరిని లాక్కునే ప్రయత్నం చేసి, నవ్వుల పాలయ్యారన్నారు. చట్టం గురించి అవగాహన లేని కొంత మంది అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త మేయర్ ఎన్నిక చట్ట ప్రకారం జరుగుతుందని తెలిపారు. కొత్త మేయర్ వచ్చే వరకు తాత్కాలిక మేయర్ ఉంటారని ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్ కుమార్ పేర్కొన్నారు.

# గవర్నర్‌ను కలవనున్న జగన్ పోలీసులు అలర్ట్




ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను (గురువారం) వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కలవనున్నారు. గవర్నర్‌తో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. అలాగే, మెడికల్ కాలేజీల పీపీపీ విధానంపై సేకరించిన కోటి సంతకాల ప్రతులు గవర్నర్‌కు ఇవ్వాలని జగన్ నిర?యించారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్‌ను కలవనుండటంతో ఏపీ పోలీసులు అప్రమత్తమయ్యారు. గవర్నర్‌ను కలిసేందుకు భారీ ర్యాలీతో వెళ్లాలని వైసీపీ నేతలు ప్లాన్ చేసినట్లు సమాచారం.ఈ నేపథ్యంతో లోక్‌భవన్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. లోక్‌భవన్, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. విజయవాడ నగరంలోని లోక్ భవన్, దాని పరిసర ప్రాంతాలు రాజ్యాంగ కార్యాలయం, అత్యంత భద్రత కలిగిన కీలక మౌలిక సదుపాయాల ప్రాంతం, ప్రజాశాంతి, భద్రత, ట్రాఫిక్ నిర్వాహణ ద ృష్ట్యా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, నియంత్రణలు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు.అలాగే, (గురువారం) లోక్‌భవన్ పరిసరాల్లో, ఎంజీ రోడ్డుపై, సివిల్ కోర్ట్స్, స్టేట్ గెస్ట్‌హౌస్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏ విధమైన ప్రజా ర్యాలీలు, పాదయాత్రలు, ప్రదర్శనలు లేదా సమావేశాలు నిర్వహించడానికి అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా కేవలం పోలీస్ శాఖ నుంచి ముందస్తుగా అనుమతి పొందిన పరిమిత సంఖ్యలో ప్రతినిధులు మాత్రమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి, అనంతరం లోక్ భవన్‌లో వినతి పత్రం సమర్పించేందుకు అనుమతి ఇచ్చామని.. ఇతరులు ఎవరూ రాకూడదని పోలీసులు స్పష్టం చేశారు.నిబంధనలివే. లోక్‌భవన్ పరిసరాలు, ఎంజీ రోడ్డుపై గుమికూడొద్దు.ర్యాలీలు, పాదయాత్రలు, వాహనాల ఊరేగింపులు నిర్వహించొద్దు.డీజేలు, లౌడ్ స్పీకర్లు, డ్రోన్లు వంటివి ఉపయోగించరాదు.ఈ సూచనలు , పోలీస్ యాక్ట్, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం అమల్లో ఉన్నాయని తెలిపారు.ఏపీవ్యాప్తంగా ప్రజలందరూ ఈ సూచ నలను గౌరవించి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# జోగి రమేష్ బ్రదర్స్‌కు దక్కని ఊరట



**అమరావతి, డిసెంబర్ 18:** నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు ఊరట లభించలేదు. అద్దేపల్లి బ్రదర్స్, జోగి బ్రదర్స్ బెయిల్ పిటిషన్లను ఎక్సైజ్ కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు.. బాదల్ దాస్ ప్రదీప్ దాస్ కళ్యాణ్, రవి , శ్రీనివాస్ తిరుమలశెట్టి, శ్రీనివాస్ రెడ్డి సతీష్‌లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి శ్రీరాములు, అద్దేపల్లి జనార్దన్ రావుతోపాటు ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్ రావు తోపాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న నిందితులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం వీరు ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్లపై ఈ రోజు విచారణ జరిపిన కోర్టు ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న ఈ నలుగురికి తప్పించి.. మిగిలిన ఏడుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఇరు వర్గాల న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ నకిలీ మద్యం కేసులో అద్దేపల్లి బ్రదర్స్‌కు జోగి బ్రదర్స్ అండగా ఉండి ప్రోత్సహించినట్లు కోర్టుకు ఆధారాలను ప్రభుత్వం తరఫు న్యాయవాది ఇప్పటికే అందజేశారు.ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కోర్టు ఈ నలుగురి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నలుగురికి ఈ రోజుతో రిమాండ్ ముగియనుంది. దాంతో వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు పోలీసులు వీరిని హాజరుపరిచారు. డిసెంబర్ 31వ తేదీ వరకు వారి రిమాండ్‌ను పొడిగిస్తూ.. ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు.అయితే తమను నెల్లూరు కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు మార్చాలంటూ వీరు కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం విచారిస్తామని ఎక్సైజ్ కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి కోర్టు తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం ఉంది.

# ఆ రెండు కార్యాలయాలను అక్కడే ఉంటాయి, తరలించం ఏపీ హైకోర్టుకు చెప్పిన ప్రభుత్వం




**అమరావతి:** ఏపీ ప్రభుత్వం లోకాయుక్త, ఏపీ మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్‌సీ) కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం తరఫున స్పెషల్ లాయర్ (ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ కార్యాలయాల తరలింపుపై ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై హైకోర్టు స్పందించింది. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త వంటి సంస్థల ఏర్పాటు అనేది ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో భాగమని, కాబట్టి వాటిలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడానికి కొన్ని పరిమితులు ఉంటాయని ధర్మాసనం పేర్కొంది. ఈ కార్యాలయాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ విధానానికి సంబంధించిన విష యం అని కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసు విచారణలో భాగం గా, 2021లో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ ప్రతి కోర్టు రికార్డుల్లోకి చేరలేదు. ఈ లోపం కారణంగా, కేసు విచారణను తదుపరి తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరం జన్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది.2021లో డాక్టర్ మద్దిపాటి శైలజ, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ (ఏపీసీఎల్ఏ) సంయుక్త కార్యదర్శి ఏకేఎన్ మల్లేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర విభజన చట్టానికి విరుద్ధంగా లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని సవాలు చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు లోకా యుక్త, హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలను తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేశారని, ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని పిటిషనర్ల తరఫు వినిపించారు. అయితే, ఆ ప్రయత్నాన్ని విరమించి, కర్నూలులో ఈ న్నారు. శ్రీకాకు ళం నుంచి కర్నూలుకు వెళ్లడం చాలా కష్టమని, అందు వల్ల న్యాయ స్థానాలు, ట్రైబ్యునళ్లు, న్యాయ సంబంధ సంస్థలన్నీ రాజధాని అమరావతిలోని జస్టిస్ సిటీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని న్యాయవాది ప్రసాదబాబు వాదించారు. రాష్ట్ర విభజన చట్టంలోని నిబంధనలకు ఇది విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగు తుండగా. మరోసారి ఏపీ హైకోర్టులో ఈ పిటిషన్ విచారణకు రాగా ప్రభుత్వం కార్యాలయాల తరలింపుపై క్లారిటీ ఇచ్చింది.

# జీ రామ్‌జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'జీ రామ్‌జీ' పేరుతో తీసుకు వచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్షణ సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. బిల్లుపై సుధీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. లోక్ సభలో గందరగోళం.కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు.మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్ధించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతుందని చెప్పుకొచ్చారాయన. %వీ+బీ=జు+రూ% అవినీతి సాధనం తప్ప మరొకటి కాదని, అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అనంతరం సభను వాయిదా వేశారు.సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు ప్రియాంక.కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పైకి విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్ ముగ్గురు మావోయిస్టుల మృతి



**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. సుక్మా జిల్లా గొల్లపల్లి అటవీ ప్రాంతం పరిధిలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌కు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. అయితే, మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది .ఉదయం నుంచే ఆ ప్రాంతంలో అప్పుడప్పుడూ కాల్పులు శబ్దాలు వినిపించాయి. దీంతో, అధికారులు హైఅలర్ట్‌లో ఉన్నారు. ఇక తాజా ఎన్‌కౌంటర్ తరువాత పోలీసులు ఆ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఆ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేత చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. అక్కడ నక్సల్స్ కదలికలు ఉన్నాయన్న సమాచారంతో తొలుత భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఇంతలో నక్సలైట్స్ కాల్పులకు దిగడంతో భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగారు. ఈ ఘటనలో కొందరు మావోయిస్టులు మరణించినా గాయపడ్డ వారు అడవిలోకి పారిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు, అదనపు భద్రతా దళాలు కూడా రంగంలోకి దిగాయి. ఆ ప్రాంతం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయి ప్రకటన ఇంకా చేయాల్సి ఉంది. ఏరివేత చర్యలు మొత్తం పూర్తయ్యాక భద్రతా దళాలు.. మృతుల వివరాలు వెల్లడిస్తాయని సమాచారం. ప్రస్తుతం గొల్లపల్లి అటవీ ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయి. జిల్లా యంత్రాంగా పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది.

# 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మా పోటీ దుష్టశక్తి 'డీఎంకే'తోనే



**కరూర్ :** తమిళనాట రాజకీయ అరంగేట్రం చేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, అగ్ర నటుడు దళపతి విజయ్ సంచలన కామెంట్స్ చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికార పార్టీ డీఎంకేపై తీవ్రస్థాయి లో ధ్వజమెత్తారు. డీఎంకేను దృష్టశక్తిగా అభివర్ణించారు. తన పార్టీ టీవీకేను పవిత్ర శక్తిగా చెప్పుకొచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన పోటీ పవిత్ర శక్తి – దుష్టశక్తి మధ్యనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.గురువారం ఈరోడ్‌లో నిర్వహించిన టీవీకే బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దివంగత ఏఐఏడీఎంకే నేతలు ఎం.జి. రామచంద్రన్ (ఎంజీఆర్), జయలలితలు డీఎంకేను తరచూ దుష్టశక్తిగా పిలిచేవారని ఆయన గుర్తు చేశారు. అదే సంప్రదాయాన్ని తాము కూడా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. స్టాలిన్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విజయ్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆరోపించారు. రైతులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన టీవీకే ర్యాలీ తర్వాత విజయ్ నిర్వహించిన తొలి బహిరంగ సభ ఇదే కావడం గమనార్హం. ఆ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన నేపథ్యంలో, ఆ తర్వాత ఆయన కాంచీపురంలో పరిమిత సంఖ్యలో నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అలాగే పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలో ఒక సభను నిర్వహించారు. అయితే తమిళనాడులో మాత్రం కరూర్ ఘటన తర్వాత నిర్వహించిన తొలి బహిరంగ సభ ఇదే.ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తనపై కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే ప్రజల మద్దతుతో ఆ ప్రయత్నాలు విఫలమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. దివంగత సీఎంలు సీఎన్ అన్నాదురై, ఎంజీఆర్?లు తమిళ ప్రజలందరికీ స్ఫూర్తి అని, వారు ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని విజయ్ స్పష్టం చేశారు. తమ రాజకీయ ప్రసంగాల్లో వారి పేర్లు ప్రస్తావించడంపై ఎవరికీ అభ్యంతరం చెప్పే హక్కు లేదని ఆయన నొక్కి చెప్పారు.

# ప్రతిపక్ష నేత ఆగ్రహం రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఉందా




**బళ్లారి(బెంగళూరు):** జైల్లో ఉండే దొంగలకు, తీవ్రవాదులకు బయటినుంచి వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరంగా మారింది. బయట నాలుగు హత్యలు చేసి జైలుకు వెళ్లిన సీనా, అనేక నేరాలపై జైలుకెళ్లిన వారికి అక్కడే అన్నీ అందుతున్నాయని విధానసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ మండిపడ్డారు. బెళగావిలో జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో బుధవారం ప్రత్యేక అంశంపై చర్చ సమయంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో ఉన్న పోలీసులు కొందరు దొంగలు, ఖూనీ కోర్లతో కలిసి నేరాలను ప్రోత్సహిస్తున్నారని అశోక్ ఆరోపించారు. జైలులో ఉంటూనే తీవ్రవాదులు, వివిధ హత్యకేసుల్లో శిక్ష అనుభవిస్తున్నవారు బయట నేరాలు చేయిస్తున్నారన్నారు. జైల్లోనే బర్డ్‌డేలు చేసుకుని కేక్ కట్‌చేయడం, గంజాయి తాగడం ఇలా అనేక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇందుకు ఉదాహరణగా సభలో ఆయన పెన్‌డ్రైవ్‌ను సాక్ష్యంగా చూపారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఉందా.. చచ్చిందా అని ఆయన సభలో హోం మంత్రి పరమేశ్వర్‌ను ప్రశ్నించారు. దీనికి హోం మంత్రి సమాధానమిస్తూ.. ప్రతిపక్ష నాయకుడు చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. కానీ వాస్తవాలు ఉంటే పరిశీలించి నేరాలకు పాల్పడే పోలీసులపై క్రమశిక్షణ తీసుకుంటామన్నారు.

# ఇక ఆ మూడు అంశాలపై మా సంస్థ దృష్టి
# ఇండిగో సంక్షోభం ముగిసిన వేళ సీఈఓ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:**ఇండిగో సంక్షోభం ముగిసిన అనంతరం ఆ సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సర్వీసులు పునరుద్ధణ తర్వాత ఇండిగోను పునర్నిర్మించడంపైనే దృష్టి సారించామని అన్నారు. ఇండిగో దృష్టి ఇప్పుడు మూడు అంశాలపై ఉంద న్నారు. ఇటీవలే ఇండిగోకు చెందిన వేలాది విమానాలను రద్దు కావడం, విమానాశ్రయాలలో లక్షలాది మంది ప్రయాణికు లకు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభ సమయంలో తనకు అండగా నిలిచిన సిబ్బందికి ఆ సంస్థ సీఈఓ ధన్యవాదా లు తెలియజేశారు. ఇండిగో ఉద్యోగులను ఉద్దేశిస్తూ ఓ వీడియో ను రిలీజ్ చేశారు.'ఏవియేషన్ కన్సల్టింగ్ నిపుణుడి నియామకం''"కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత విమానయాన సంస్థ ఇండిగోకు పునర్నిర్మించడంపైనే దృష్టి సారించాం. ఇటీవలి విమాన సర్వీసుల భారీ అంతరాయాలకు మూల కారణాన్ని విశ్లేషించేందుకు ఇండిగో బోర్డు ఒక విమానయాన నిపుణుడిని నియమించింది. డిసెంబర్ 9న నేను ఇండిగో కార్యకలాపాల స్థిరీకరణ గురించి తెలియజేశాను. ఇప్పుడు (గురువారం) మేము మా సంస్థకు చెందిన 2,200 విమాన సర్వీసులను పునరుద్ధరించాం. ప్రస్తుతం మేము మూడు విషయాలపై దృష్టి సారిస్తున్నాం. స్థిరత్వం, మూల కారణాల విశ్లేషణ, విమానయాన సంస్థను పునర్నిర్మించడం వంటి వాటిపై దృష్టి పెడుతున్నాం" అని పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు."నేను, నాయకత్వ బృందంతో కలిసి ఇండిగో ఉద్యోగులను కలుస్తాను. అంతరాయాల సమయంలో వారు ఎదుర్కొన్న సవాళ్లను తెలుసుకుంటాను. ఎయిర్ లైన్స్ ఒక సవాలుతో కూడిన కాలం తర్వాత బలంగా ఉద్భవించింది. మళ్లీ సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇటీవలి ఇండిగో సంక్షోభం సమయంలో ఐక్యంగా ఉన్న ఉద్యోగులకు కృతజ్ఞతలు. ప్రియమైన ఇండిగో సహోద్యోగులారా గత రెండు వారాలు మనందరికీ చాలా సవాల్?గా మారాయి. ఆ సమయంలో మద్దతుగా ఉన్న పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, విమానాశ్రయ సిబ్బంది, కంట్రోల్ ఆపరేషన్స్, కస్టమర్ సర్వీస్ బృందాలకు ధన్యవాదాలు. ఇండిగో సంక్షోభం నుంచి త్వరగా బయటపడి తమ కార్యకలాపాలను వేగంగా ప్రారంభించింది. ఇకపై ఉద్యోగులు ప్రశాంతంగా ఉండాలి. వారు తమ బాధ్యతలపై దృష్టి సారించాలి. సంక్షోభానికి సంబంధించి వస్తున్న ఊహాగానాలకు దూరంగా ఉండాలి. అంతరాయాల సమయంలో ఉద్యోగులు ఎదుర్కొన్న సవాళ్లు, ఇబ్బందుల గురించి తెలుసుకునేందుకు నాతో సహా నాయకత్వ బృందం పనిచేస్తోంది" అని పీటర్ వెల్లడించారు.ఇండిగో ప్రయాణాన్ని గుర్తు చేసుకున్న సీఈఓఅలాగే ఇండిగో 19 సంవత్సరాల ప్రయాణాన్ని సైతం పీటర్ ఎల్బర్స్ గుర్తుచేసుకున్నారు. "2006లో అంటే 19 ఏళ్ల క్రితం ఒక విమానంతో ఇండిగో ప్రయాణం ప్రారంభమైంది. ఇప్పుడు ఇండిగో సిబ్బంది ఏకంగా 65,000 మంది. ఈ 19 ఏళ్లలో 850 మిలియన్లకు పైగా కస్టమర్లు ఇండిగో విమానాల్లో ప్రయాణించారు. ఏ లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించామో ఆ విధంగానే భారత్ లో సేవలు అందిస్తున్నాం. ఇండిగో విశ్వసనీయత, నమ్మకం, క్రమశిక్షణ, కస్టమర్ల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని దేశానికి సేవ చేస్తూనే ఉంటుంది." అని పీటర్ స్పష్టం చేశారు.మరోవైపు, విమానాల రద్దు, ప్రయాణీకుల ఇబ్బందులపై ఇండిగోపై దాఖలు చేసిన కొత్త ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్ )ను దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్ లో లేవనెత్తిన సమస్యలు కోర్టు ముందు పెండింగ్ లో ఉన్న రిట్ పిటిషన్ లో ఇప్పటికే పరిశీలనలో ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు దిల్లీ హైకోర్టు నిర్ణయం తీసుకుంది.ఇండిగో సంక్షోభండిసెంబరు 2 నుంచి దేశవ్యాప్తంగా వందలాది ఇండిగో విమానాలు రద్దు అయ్యాయి. అనేక రోజుల పాటు ఈ సంక్షోభం ఉంది. ఈ క్రమంలో ప్రయాణికులు ఎయిర్ పోర్టుల్లో ఇబ్బంది పడ్డారు. అలాగే చాలా మంది ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఇదే అంశం పార్లమెంట్ ను సైతం కుదిపేసింది. దీంతో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వివరణ ఇచ్చారు.

# బంగ్లాదేశ్‌లో మరో రెండు భారత వీసా కేంద్రాలు మూసివేత





**బంగ్లాదేశ్ :** పొరుగుదేశమైన బంగ్లాదేశ్ లో మరో రెండు భారత వీసా కేంద్రాలు మూతపడ్డాయి. రాజ్‌షాహి , ఖుల్నా లోని వీసా కేంద్రాలను భారత్ మూసేసింది. రాజధాని ఢాకాలోని వీసా కేంద్రాన్ని ఇప్పటికే భారత్ మూసివేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ నాయకులు, అసాంఘిక శక్తుల నుంచి బెదిరింపుల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా వీసా కేంద్రాలను భారత్ మూసివేసింది. 'భద్రతా పరిస్థితుల దృష్ట్యా రాజ్‌షాహి, ఖుల్నాలోని వీసా కేంద్రాలను మూసివేస్తున్నాం. వీసా దరఖాస్తు కోసం ఈరోజు బుక్ అయిన అపాయింట్‌మెంట్ స్లాట్‌లను మరో తేదీకి మారుస్తాం' అని భారత్ ప్రకటించింది.మరోవైపు ఢాకాలోని జమున ఫ్యూచర్ పార్క్‌లో భారత వీసా అప్లికేషన్ సెంటర్ భారత్ బుధవారం మూసివేసిన విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు కొరవడ్డాయి. ఆ దేశంలో రోజురోజుకు సురక్షిత వాతావరణం తగ్గిపోతుండడాన్ని సీరియస్‌గా తీసుకున్న విదేశీ మంత్రిత్వ శాఖ భారత్‌లోని బంగ్లా దౌత్యాధికారికి ఉదయం సమన్లు జారీ చేసింది. ఆ కొద్దిసేపటికే ఢాకా వీసా అప్లికేషన్ సెంటర్లో సేవలకు మంగళం పాడింది. ఇప్పుడు తాజాగా మరో రెండు వీసా సెంటర్ల సేవలను నిలిపివేసింది.

# అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రి శాఖ తొలగింపు



**ముంబై:** అసెంబ్లీలో రమ్మీ ఆడిన మంత్రిని పదవి నుంచి తొలగించారు. అయితే సీఎంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఏ పదవీ లేని మంత్రిగా కేబినెట్‌లో ఆయన ఉన్నారు. బీజేపీ పాలిత మహారాష్ట్రలో ఈ సంఘటన జరిగింది. ఈ ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మొబైల్ ఫోన్‌లో రమ్మీ ఆడుతూ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్ వర్గం) క్రీడా మంత్రి మాణిక్‌రావు కోకాటే పట్టుబడ్డారు. ఆయనపై చర్యలు తీసుకుంటామని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నాడు హెచ్చరించారు. అయితే మహాయుతి కూటమి ప్రభుత్వంలో ఒత్తిడి వల్ల మిన్నకుండిపోయారు.కాగా, 1995 గృహనిర్మాణ కుంభకోణం కేసులో మంత్రి మాణిక్‌రావు కోకాటే, ఆయన సోదరుడ్ని ముంబై కోర్టు దోషిగా నిర్ధారించింది. రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును బాంబే హైకోర్టులో ఆయన సవాల్ చేశారు. అయితే శుక్రవారం విచారణ జరుపుతామని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో బుధవారం మంత్రి పదవికి ఆయన రాజీనామా చేశారు. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ముంబై ఆసుపత్రిలో చేరారు.మరోవైపు మాణిక్‌రావు కోకాటే కోర్టు వ్యవహారంపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. కూటమి ప్రభుత్వంలో భాగమైన డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో చర్చించారు. గతంలో షిండే వర్గం మంత్రులపై ఆరోపణలు, కోర్టు కేసుల్లో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం ఫడ్నవీస్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మాణిక్‌రావు కోకాటేను క్రీడా మంత్రిత్వ బాధ్యతల నుంచి గురువారం తొలగించారు. ఎమ్మెల్యే అనర్హత అంశం ఇంకా తేలకపోవడంతో ఆయన రాజీనామాను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో ఏ పదవి లేని మంత్రిగా కేబినెట్‌లో ఆయన ఉన్నారు.


# 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా



**అమెరికా:** తాను ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చాటింపు వేసుకున్నారు. ఇందుకు టారిఫ్‌లే కారణమని పేర్కొన్నారు. ఆంగ్లభాషలో 'టారిఫ్' అనే పదం తనకు చాలా ఇష్టమైన పదం అని ట్రంప్ పునరుద్ఘాటించారు.'పది నెలల్లో ఎనిమిది యుద్ధాలను ఆపాను . ఇరాన్ అణు ముప్పును నాశనం చేశాను. గాజాలో యుద్ధాన్ని ఆపి.. మూడు వేల సంవత్సరాల్లో పశ్చిమాసియాలో తొలిసారి శాంతిని నెలకొల్పా. ఎంతోమంది బందీలను విడుదల చేయించాను' అని ట్రంప్ తెలిపారు. అదేవిధంగా సుంకాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. అమెరికాలో 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించగలిగామని ఈ సందర్భంగా తెలిపారు. ఇదంతా సుంకాల కారణంగానే సాధ్యమైందన్నారు.ఈ సందర్భంగా అమెరికాకు చెందిన ప్రతి సైనికుడికి ట్రంప్ 1,776 డాలర్ల నగదు బహుమతి ప్రకటించారు. 1.45 మిలియ న్లకు పైగా సైనికులు క్రిస్మస్ కానుగా ఒక్కొక్కరు 1,776 డాలర్ల నగదు అందుకుంటారని తెలిపారు. ఇది వారి సేవ, త్యాగానికి గుర్తింపుగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుంకాల కారణంగా ఎవరూ ఊహించనంత డబ్బు సంపాదించినట్లు చెప్పారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్లు సాయపడిందని ట్రంప్ వివరించారు.

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి !

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా



కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు.


పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేక మైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

# పంచాయితీ ఎన్నికల్లో చిత్రవిచిత్రాలు

**పసుపు బియ్యంపై ప్రమాణాలు**

**ఒకటి రెండు ఓట్లతో ఓటమి..గెలుపు**

**టాస్ విజేతల్లో ఆనందోత్సాహాలు**




**హైదరాబాద్,డిసెంబర్18:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనేక చిత్ర విచిత్రాలు జరిగాయి. ఒకే కుటుంబంలో కొందరు పరస్పరం పోటీ పడ్డారు. డబ్బులు ఇచ్చిన ఓటేయలేదని కొందరు ఆక్రోశించారు. పసుపు బియ్యం పట్టుకుని ప్రమాణం చేయించారు. దేవుడి ఫోటోమీద ప్రమాణాలు జరిగాయి. ఏతావాత ఓటింగ్ మాత్రం అద్భుతంగా సాగింది. ఒకటి, రెండు, మూడు ఇలా స్వల్ప ఓట్ల తేడాతో పలువురు అభ్యర్థులు గెలుపొందగా, మరికొందరు ఓటమి పాలయ్యారు. కొందరికి సమాన ఓట్లు రాగా టాస్ వేసి విజేతలను ప్రకటించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామంలో ఒక్క ఓటుతో నక్క మల్లేశ్‌ను సర్పంచ్ పదవి వరించింది. మొదట ఒక్క ఓటు అధిక్యం రాగా, రీ కౌంటింగ్‌లోనూ మల్లేశ్‌ను గెలుపు వరించింది. బైంసా మండలం లింగా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సుష్మారాణి ఒక్క ఓటుతో గెలుపొందారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గుర్రాలగండిరాజపల్లి లో కాంగ్రెస్ అభ్యర్థి బూస నర్సయ్య ఒక్క ఓటుతో గెలిచారు. నెక్కొండ మండలం అమీన్‌పేటలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి డెక్క చంద్రయ్య తొలుత ఒక్క ఓటుతో గెలువగా, ప్రత్యర్థులు రీ కౌంటింగ్‌కు డిమాండ్ చేశారు. చివరకు కలెక్టర్ జోక్యంతో ఇక్కడ ఫలితాన్ని ప్రకటించినట్టు సమాచారం. కాంగ్రెస్ బలపరిచిన డెక్క ఎల్లయ్యకు 256 ఓట్లు రాగా, బీఆర్ఎస్ బలపరిచిన డెక్క చంద్రయ్యకు 255 ఓట్లు వచ్చాయి. ఒక్క ఓటు తేడాతో ఎల్లయ్య గెలిచినట్టు అధికారులు ప్రకటించారు. నెక్కొండ మండలం సీతారాంపురంలో బీఆర్ఎస్ మద్దతునిచ్చిన అభ్యర్థి కట్కూరి విజయలక్ష్మి ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. నెక్కొండ మండలం రెడ్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి అంగోత్ ఉమ రెండు ఓట్ల తేడాతో గెలిచింది. నెక్కొండ మండలం మడిపెల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి అంగోత్ అనూష మూడు ఓట్ల తేడాతో గెలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండ లం భూక్యాతండా సర్పంచ్ స్థానానికి తొలు త ఎనిమిది మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ బలపరిచిన మదన్‌కు మద్దతు ఇవ్వాలని తండావాసుల నిర్ణయంతో ఆరుగురు విత్ డ్రా చేసుకున్నారు. చివరి రోజు బీఆర్ఎస్ బలపరిచిన రమావత్ శ్రీకాంత్ సైతం విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లగా, మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో అధికారులు లోపలికి అనుమతించలేదు. మూడో విడతతో మూడు ఓట్ల అధిక్యంతో శ్రీకాంత్ గెలిచాడు. అదృష్టం వరించిన అభ్యర్థులు నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని బెల్గాం తండా సర్పంచ్‌గా జాదవ్ గోకుల్‌దాస్ టాస్ ద్వారా ఎన్నికయ్యాడు. బెల్గాం తండా జీపీలో అనిల్, జాదవ్ గోకుల్‌కు 192 చొప్పున సమాన ఓట్లు వచ్చాయి. దీంతో టాస్ వేయగా అదృష్టం గోకుల్‌ను వరించింది. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలోని కంఠం గ్రామంలో టాస్ ద్వారా సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజ్గిరి సాయినాథ్ గెలుపొందారు. ఇబ్రహీంపేట్ జీపీ, బోర్లం క్యాంపు తండాలో ఇద్దరు వార్డు సభ్యులను టాస్ ద్వారా నిర్ణయించారు.

# రీకౌంటింగ్‌లోనూ ఒక్క ఓటుతో విజయం

**రంగాపూర్‌లో విజయం సాధించిన గంట రమేశ్**



**పెద్దపల్లి,డిసెంబర్18:** ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది. ఒక్క ఓటు ఎందరినో గెలిపిస్తుంది అంటుంటారు. సామాన్యుడికి ఓటు వజ్రాయుదం అన్నట్లు.. ఓటుతోనే ఏదైనా సాధించవచ్చని అన్నట్లు.. తలరాతలనే తారుమారు చేసేలా మారింది ఓటు. పెద్దపల్లి మండలం రంగాపూర్ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా అదే ఆవిష్కృతమైంది.మూడో విడుత ఎన్నికల సందర్భంగా రంగాపూర్ గ్రామానికి సర్పంచ్ అభ్యర్థులుగా గంట రమేష్, కలబోయిన నరేందర్, ఈర్ల భువన్ తేజ్ పోటీ చేశారు. అయితే ఈ నెల 5న నామినేషన్లతో ప్రారంభమైన ఎన్నికల తంతు బుధవారం జరిగిన ఎన్నికలతో ముగిసింది.ఇక్కడ ఒకే పార్టీలో ఒకే నాయకునికింద ప్రధాన అనుచరులుగా చలామణి అయినవారు ఇప్పుడు ప్రత్యర్థులుగా మారి ఎన్నికల్లో తలపడ్డారు. అయితే హోరాహోరీగా జరిగిన ఎన్నికల ప్రచారంతో టగ్ ఆఫ్ వార్ లా కొనసాగింది. ఈ క్రమంలో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీలోనే పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావుకు ప్రదాన అనుచరులుగా ఉన్న ఇద్దరు నాయకులు ఆ గ్రామానికి మాజీ ప్రజాప్రతినిధులే కావడం విశేషం. అందులో ఒకరు గంట రమేష్ కాగా మరొకరు కలబోయిన మహేందర్ తమ్ముడు నరేందర్. వీరిద్దరు కూడా అదే గ్రామానికి ఒకే పార్టీ నుంచి ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులుగా రంగంలో దిగారు, గత వారం రోజులుగా హోరాహోరీ జరిగిన ప్రచారంలో పోలింగ్ జరిగింది. గంట రమేష్ బ్యాట్ గుర్తుకు 886 ఓట్లు , ప్రత్యర్థి కలబోయిన నరేందర్‌కు 884ఓట్లు వచ్చాయి. అలాగే మరో అభ్యర్థి ఈర్ల భువనతేజకు 5 ఓట్లు పోలవగా, ఒక ఓటు నోటాకు పడింది. పోలైన ఓట్లలో 15ఓట్లు చెల్లకుండా పోయాయి. కెవలం రెండు ఓట్లతో గంట రమేష్ గెలువడం ఇరువర్గాలను ఆందోళనకు గురి చేసింది. పోలైన 15 ఓట్లు చెల్లనివిగాపోవడంతో అవి మాకు సంబంధించినవే అయి ఉండవచ్చని బావించిన ప్రత్యర్థి వర్గంతో పాటు అభ్యర్థి కూడా రీకౌంటింగ్ చేయాలనిపట్టు బట్టడడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోలైన ఓట్లకు రీ కౌంటింగ్ జరిపారు. రీ కౌంటింగ్ అనంతరం గంట రమేష్‌కు ఒక ఓటు తగ్గి 885, కలబోయిన నరేందర్‌కు 884 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్ తర్వాత ఒక ఓటు తగ్గిపోయి ఒకే ఒక్క ఓటుతో గంట రమేష్ తన సమీప ప్రత్యర్థి కలబోయిన నరేందర్‌పై విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఒక్క ఓటు ఇద్దరు అభ్యర్థులకు, వారి అనుచరగణానికీ గంటపాటు చెమటలు కక్కించింది.

# వల్లభనేని వంశీపై మరో కేసు నమోదు

**విజయవాడ,డిసెంబరు18:** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఊహించని షాక్ తగిలింది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వల్లభనేని వంశీపై గురువారం కేసు నమోదైంది. సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేశారు. 2024లో జులైలో తనపై వంశీ ఆయన అనుచరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వంశీతో సహా మరో ఎనిమిది మందిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సత్యవర్ధన్‌ను వంశీ అండ్ కో కిడ్నాప్ చేసి దాడి చేశారని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో వల్లభనేని వంశీ జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. 2023లో గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి జరిగింది. అయితే ఈ దాడిలో ప్రధాన సాక్షిగా సత్యవర్ధన్ ఉన్నారు. ఈ ఘటనలో ఆయన ఇచ్చిన ఫిర్యాదే కీలకంగా మారింది. ఈ క్రమంలో సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే వల్లభనేని వంశీతో పాటు ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు.



# విజయోత్సవాలకు అనుమతి లేదు

**• ఎన్నికల కోడ్ ఇంకా అమల్లోనే ఉంది: జిల్లా కలెక్టర్ హన్మంతరావు**

**యాదాద్రి భువనగిరి,డిసెంబర్ 18:** పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎవరూ వియోత్సవ ర్యాలీలు జరుపుకోవద్దని కలెక్టర్ హన్మంతరావు ముందే ఆదేశించారు. అన్ని దశల్లో ఎన్నికల ప్రశాంతంగా జరిగాయని అన్నారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాం. ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. విజేతలు విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు జరుపుకోవద్దు. నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. యాదాద్రి జిల్లాలో మూడో విడతలో 92.56 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం1,59,289 మంది ఓటర్లు ఉండగా, 1,47,432 ఓట్లు పోలయ్యా యి. 92.79 శాతంగా ఉన్న 73,640 మంది పురుష లు, 92.33 శాతంగా ఉన్న 73,792 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు నిర్వహించిన ఆరు మండలాల్లోనూ 90 శాతానికి పైగా రికార్డు స్థాయిలో ఓటింగ్ శాతం నమోదైంది. అత్యధికంగా చౌటుప్పల్ మండలంలో 94.25 శాతం మంది ఓటేశారు. ఆ తర్వాత గుండాలలో 92.83, సంస్థాన్ నారాయణపురంలో 92.44 శాతం, మోటకొండూరులో 92.28, అడ్డగూడూరులో 91.29 శాతం, మోత్కూరులో 90.11 శాతం మంది ఓటేశారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు.

# ఈ మసాలా దినుసులతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు!

మన నిత్యజీవితంలో ఉపయోగించే మసాలా దినుసులు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తాయి అనే విషయం ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా తెలుసుకోవాలి. మసాలా దినుసులను మనం వివిధ రకాల వంటకాలలో సువాసనను, రుచిని పెంచడానికి ఉపయోగిస్తూ ఉంటాం. అయితే అటువంటి మసాలా దినుసు లు మనకు కావాల్సిన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి .అవి మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. వాటి గురించి ప్రస్తుతం తెలుసుకుందాం.

**లవంగాలు :** లవంగాలలో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. లవంగాలు వంటల రుచిని పెంచడమే కాకుండా జలుబు, దగ్గు, పంటి నొప్పి వంటి సమస్యలకు ఎంతో బాగా పని చేస్తాయి. లవంగాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మన జీర్ణక్రియ, అజీర్ణం, గ్యాస్ సమస్యలు తగ్గు తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను లవంగాలు నివారిస్తాయి.



**యాలుకలు :** వివిధ వంటకాలలో ఉపయోగించే యాలకులు మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి స్తాయి. యాలుకలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల అధిక రక్తపోటు నియంత్రించబడుతుంది. డిప్రెషన్‌ను తగ్గించడానికి యాలుకలు ఎంతో ఉపయోగపడతాయి. యాలకులు జీర్ణక్రియను మెరుగుపరిచి జీర్ణ సంబంధిత సమస్యలకు పరిష్కారంగా ఉంటాయి.ఒత్తిడిని, ఆందోళనను తగ్గించడంలో యాలుకలు ఎంత బాగా ఉపయోగపడతాయి.

**దాల్చిన చెక్క :** దాల్చిన చెక్క మనకు ఆరోగ్యాన్ని ఇవ్వడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది.జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.అధిక రక్తపోటును తగ్గిస్తుంది.డయాబెటిస్ తగ్గించడానికి కూడా ఎంతగానో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్క లో మన చర్మానికి ఆరోగ్యాన్నిచ్చే గుణాలు కూడా ఉన్నాయి మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి.

**బిర్యానీ ఆకు :** బిర్యానీ ఆకు మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. ఇది యూరినరీ ట్రాక్ ఇన్ఫె క్షన్ లను నివారిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా బిర్యానీ ఆకు మెరుగుపరుస్తుంది. డయాబెటిస్‌ను ఒత్తిడిని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. కడుపునొప్పి, తలనొప్పి, జలుబు వంటి వాటికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది. బిర్యానీఆకులో మన శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలు ఉంటాయి.

# చల్లచల్లగా.. ఆరోగ్యంగా!







మండే ఎండకాలం మొదలైంది. వేడి వాతావరణంలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి చాలామంది కూల్ డ్రింక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. రసాయ నాలు, ప్రిజర్వేటివ్స్, గ్యాస్ కలిసిన వీటిని తాగితే.. ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి, ఈ సమ్మర్‌లో వాటి జోలికి వెళ్లకుండా.. ఇంట్లో లభించే పదార్థాలతోనే ఆరోగ్యకరమైన పానీయాలు చేసుకోండి. ఇవి.. ఎండల నుంచి రక్షణను ఇవ్వడమే కాదు, ఆరోగ్యానికి మంచి చేస్తాయి. ఒంట్లో వేడిని తగ్గించి.. శరీరానికి కొత్త శక్తిని అందిస్తాయి.

**పైనాపిల్ - నిమ్మరసం :** వేసవి వేడితో అలసటకు గురయ్యే వారికి.. పైనాపిల్ – నిమ్మరసం డ్రింక్ ఎంతో మేలుచేస్తుంది. నాలుగు నుంచి ఐదు పైనాపిల్ ముక్కలను నిమ్మరసంతో కలిపి బ్లెండ్ చేసుకోవాలి. దీనికి కొద్దిగా చల్లని నీటిని జోడించి తాగితే.. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. తీపి కోసం కొద్దిగా తేనెను కలుపుకోవచ్చు.

**అల్లం-నిమ్మకాయ :** లీటర్ నీటిలో ఒక నిమ్మకాయను పూర్తిగా పిండండి. అంగుళం అల్లం ముక్క, పుదీనా ఆకులను మెత్తగా దంచి నీటిలో బాగా కలపండి. ఈ మిశ్రమానికి చిటి కెడు నల్ల మిరియాల పొడి కలిపి తాగితే.. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నానబెట్టిన చియా విత్తనాలను కూడా జోడిస్తే.. ఒంటికి చలువ చేస్తుంది.

**నిమ్మకాయ-పుదీనా :** ఒక లీటర్ నీటిని తీసుకొని.. ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, నాలుగైదు పుదీనా ఆకులు వేయాలి. దీనికి కొద్ది గా ఉప్పు, తేనె జోడించి తాగితే.. శరీరానికి తక్షణ చల్లదనం లభిస్తుంది. చల్లచల్లగా తాగాలనుకుంటే.. ఐస్ క్యూబ్స్‌తో కలిపి కూడా తాగవచ్చు. నిమ్మకాయలో లభించే విటమిన్ సి శరీరాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు పుదీనా ఆకులు జీర్ణ వ్యవస్థకు మేలుచేస్తాయి.

**జీలకర్ర - నిమ్మకాయ :** లీటర్ నీటిలో రెండు టేబుల్ స్పూన్ల జీలకర్ర వేసి.. స్టవ్ మీదపెట్టి బాగా మరగనివ్వండి. ఆ తర్వాత నీటిని వడగట్టి.. అందులో ఒక నిమ్మకాయ రసాన్ని పిండి.. కాసేపు ఫ్రిజ్‌లో పెట్టేయండి. ఈ నీటిని చల్ల చల్లగా తాగితే.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనికి దాల్చినచెక్క పొడి, తేనె కలిపితే మరిన్ని ప్రయోజనాలు అందుతాయి. ఈ డ్రింక్.... శరీరంలో వేడిని తగ్గించడం తోపాటు జీర్ణక్రియనూ మెరుగుపరుస్తుంది.

# ఈ ఫుడ్స్ తిన్నారో 20లో వాళ్లకి 60 ఏళ్ల వృద్ధాప్య లక్షణాలు.. జాగ్రత్త మరి!

కొంతమందికి చిన్న వయస్సే ఉన్నా చూడడానికి పెద్దవారిలా కనిపిస్తారు. ఈ వృద్ధాప్య లక్షణాలకు అనేక కారణాలు ఉన్నాయి. వాటిల్లో మనం తీసుకునే ఆహారాలు కూడా ఉన్నాయి. కొన్ని ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల వృద్ధాప్య ప్రక్రియ వేగవంతం అవుతుంది. యవ్వనంగా కనిపించకుండా చేస్తాయి. ఈ ఆహారాలు శరీరంలో మంటను పెంచడం, కణాలను దెబ్బతీయడం , వృద్ధాప్య సంబంధిత వ్యాధులకు దారితీయడం వంటి అనేక విధాలుగా పనిచేస్తాయి. వృద్ధాప్య లక్షణాలను పెంచే కొన్ని ముఖ్యమైన ఆహారాల గురించి ఇక్కడ తెలుసుకుందాం..



**చక్కెరలు అధికంగా ఉండే ఆహారాలు,పానీయాలు :** చక్కెరలు ఎక్కువగా ఉండే ఆహారాలు, ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఆహారాలు , పానీయాలు వృద్ధాప్యానికి ప్రధాన కారణం. చక్కెరలు శరీరంలో గ్లైకేషన్ అనే ప్రక్రియను ప్రేరేపిస్తాయి. ఈ ప్రక్రియలో చక్కెరలు ప్రోటీన్లతో కలిసిపోయి ఏజీఈలు (అడ్వాన్స్‌డ్ గ్లైకేషన్ ఎండ్ ప్రొడక్ట్స్) ఏర్పడటానికి కారణమవుతాయి. ఈ ఏజీఈలు చర్మం యొక్క స్థితిస్థాపకతను తగ్గించి, ముడతలు, చర్మం వదులుగా మారడానికి దారితీస్తాయి. అంతేకాకుండా, చక్కెరలు అధికంగా ఉండే ఆహారాలు శరీరంలో మంటను పెంచుతాయి, ఇది వృద్ధాప్య సంకేతాలను మరింత తీవ్రతరం చేస్తుంది. ఉదాహరణకు, సోడాలు, జ్యూస్‌లు, స్వీట్లు, కేకులు, కుకీలు , ప్రాసెస్ చేసిన స్నాక్స్ వంటివి వృద్ధాప్య లక్షణాలను పెంచుతాయి.

**ప్రాసెస్ చేసిన ఆహారాలు:** ప్రాసెస్ చేసిన ఆహారాలలో సాధారణంగా అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు , రసాయన సంకలనాలు ఉంటాయి. ఈ ఆహారాలు శరీరంలో మంటను పెంచుతాయి. కణాల నష్టానికి కారణమవుతాయి. ఇవి చర్మం యొక్క ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి, ముడతలు , ఇతర వృద్ధాప్య సంకేతాలను పెంచుతాయి. ప్రాసెస్ చేసిన మాంసాలు, రెడీ–టు–ఈట్ మీల్స్, చిప్స్, ఫాస్ట్ ఫుడ్ వంటివి వృద్ధాప్య లక్షణాలను వేగవంతం చేసే ఆహారాలలో ముఖ్యమైనవి.

**వేయించిన ఆహారాలు:** వేయించిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక మొత్తంలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఈ కొవ్వులు శరీరంలో మంటను పెంచుతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడానికి కారణమవుతాయి. వేయించిన ఆహారాలు ఫ్రీ రాడికల్స్‌ను కూడా ఉత్పత్తి చేస్తాయి, ఇవి కణాలను దెబ్బతీసి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి. ఫ్రైడ్ చికెన్, ఫ్రెంచ్ ఫ్రైస్, డోనట్స్, ఇతర డీప్ ఫ్రైడ్ స్నాక్స్ వంటివి వృద్ధాప్య లక్షణాలను పెంచే ఆహారాలకు ఉదాహరణలు.

**అధికంగా ఆల్కహాల్:** అధికంగా ఆల్కహాల్ తీసుకోవడం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది, ఇది చర్మాన్ని పొడిగా , ముడతలుగా చేస్తుంది. ఆల్కహాల్ కాలేయానికి కూడా హానికరం, ఇది శరీరంలోని విష పదార్థాలను తొలగించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది చర్మం , శరీర ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు:** తెల్ల బియ్యం, మైదా పిండితో చేసిన ఆహారాలు , తెల్ల బ్రెడ్ వంటి శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి. ఇది గ్లైకేషన్ ప్రక్రియను ప్రేరేపిస్తుంది, వృద్ధాప్య లక్షణాలను పెంచుతుంది. వీటి బదులుగా, తృణధాన్యాలు , సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు.

**ట్రాన్స్ ఫ్యాట్స్:** ట్రాన్స్ ఫ్యాట్స్ ప్రాసెస్ చేసిన ఆహారాలు, వేయించిన ఆహారాలు, కొన్ని రకాల మార్గారిన్‌లలో కనిపిస్తాయి. ఇవి శరీరంలో మంటను పెంచుతాయి , గుండె జబ్బులు , ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి ఇవి చర్మం యొక్క స్థితిస్థాపకతను కూడా తగ్గిస్తాయి, ముడతలు, వృద్ధాప్య సంకేతాలను పెంచుతాయి. వృద్ధాప్య సంకేతాలను తగ్గించడానికి, ఆరోగ్యకరమైన యవ్వన రూపాన్ని పొందడానికి, ఈ ఆహారాలను వీలైనంత వరకు తగ్గించడం లేదా పూర్తిగా నివారించడం చాలా ముఖ్యం. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు వంటి పోషకమైన ఆహారాలను తీసుకోవడం వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదించడంలో సహాయపడుతుంది.

# కొబ్బరి నీరులో పోషక విలువలు

కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరికీ తెలిసిందే. ఇది సహజంగా ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో సమృద్ధిగా ఉంటుంది. అయితే, మూత్రపిండాల (కిడ్నీ) సమస్యలతో బాధపడుతున్న వారు కొబ్బరి నీరు తాగడం మంచిదా అనే ప్రశ్న చలా మందిలో ఉంది. అయితే ఇది వారి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.

**కొబ్బరి నీరులో పోషక విలువలు:** కొబ్బరి నీరు సహజంగా పొటాషియం, సోడియం, మెగ్నీషియం, కాల్షియం,ఇతర ఖనిజ లవణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయ డంలో సహాయపడుతుంది. కొబ్బరి నీరులో తక్కువ శాతం చక్కెర, కొవ్వు ఉంటాయి,అందువల్ల ఇది ఆరోగ్యకరమైన పానీయంగా పరిగణించబడుతుంది.

**మూత్రపిండాల సమస్యలు :** కొబ్బరి నీరు శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది, ఇది మూత్రపిండాల్లో కణికలు ఏర్పడకుండా ఉండటానికి ఉపయోగపడుతుంది. ఇందులో నేచురల్ సిట్రేట్ (Citrate) ఉండడం వల్ల, రాళ్లు ఏర్పడే అవకాశాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగడం వల్ల ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. అయితే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, పొటాషియం శరీరంలో పేరుకుని, ప్రమాదకరమైన స్థాయికి చేరుకోవచ్చు. కొబ్బరి నీరులో పొటాషియం అధికంగా ఉండడం వల్ల, కొంతమంది కిడ్నీ రోగులకు ఇది మేలు కాకపోవచ్చు. హైపర్‌కలేమియా ఉన్న వారు కొబ్బరి నీరు తాగేటప్పుడు వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది.

**క్రానిక్ కిడ్నీ డిసీజ్ :** దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలతో బాధపడేవారు ద్రవ పానీయాల (Fluid Intake) పరిమాణాన్ని నియంత్రించాలి. కొబ్బరి నీరులోని ఎలక్ట్రోలైట్లు, ముఖ్యంగా పొటాషియం అధిక స్థాయిలో ఉండడం వల్ల, CKD ఉన్నవారికి ప్రతికూల ప్రభావం కలిగించే అవకాశం ఉంది. కాబట్టి, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగేముందు వైద్యుని సంప్రదించడం మంచిది. కొబ్బరి నీరు రక్తపోటును కొంతవరకు నియంత్రించడం లో సహాయపడుతుంది. కానీ, అధిక సోడియం లెవల్స్ ఉన్నవారు, లేదా సోడియం పరిమిత ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉన్నవారు, కొబ్బరి నీరు త్రాగేముందు జాగ్రత్తగా ఉండాలి.

**ఎవరికి తాగొచ్చు? ఎవరికి తాగకూడదు?** చిన్నపాటి మూత్రపిండ రాళ్లు ఉన్నవారు. సాధారణ మూత్రపిండ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకునేవారు. తక్కువ పొటాషియం స్థాయితో



ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చు. అయితే హైపర్‌కలేమియా (అధికపొటాషియం) ఉన్నవారు . క్రానిక్ కిడ్నీ డిసీజ్ (CKD) ఉన్నవారు. అధిక సోడియం నియంత్రణ అవసరమైన వారు కొబ్బరి నీరు తీసుకోకపోవడమే మంచిది. మూత్రపిండాల సమస్య ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగేముందు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవాలి. కొబ్బరి నీరు ఆరోగ్యకరమైనదైనా, అది కొన్ని మూత్రపిండ సమస్యలలో ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది కాబట్టి, మీకు కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉంటే, ముందుగా వైద్య నిపుణుల సలహా తీసుకుని, అవసరమైన మార్గదర్శకత్వాన్ని పాటించడం ఉత్తమం.

# అంతరిక్ష పరిశోధనలను మలుపు తిప్పేలా- మార్స్‌పై.. !!

Mars: అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త ఆవిష్కరణకు తెర తీసింది చైనా. అంగారాక గ్రహంపై నీటి జాడను గుర్తించింది. ఒకప్పుడు లోతైన సముద్రాలు, సువిశాల ఇసుక తిన్నెలు ఉండేవనే నిర్ధారణకు వచ్చింది. ఈ మేరకు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రొసీడింగ్స్‌లో ఓ జర్నల్‌ను ప్రచురించింది.



**చైనా రోవర్..**

మార్స్ పై పరిశోధనలను నిర్వహించడానికి ఝురాంగ్ అనే రోవర్‌ను పంపించింది చైనా. 2021లో ఇది అక్కడ ల్యాండ్ అయింది. అప్పటి నుంచీ రీసెర్చ్ కొనసాగిస్తోంది. తాజాగా నీటి జాడలను గుర్తించింది. ఒకప్పుడు అంగారక గ్రహం ఇప్పుడు ఉన్నట్టుగా ఉండేది కాదని తేల్చి చెప్పింది. సముద్రాలు ఉండేవ నడానికి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించింది.

**3.5 నుంచి 4 బిలియన్ సంవత్సాల కిందట..**

నాలుగు బిలియన్ సంవత్సరాల కిందట అచ్చంగా భూమిని పోలి ఉండే రాతి పొరలు, ఇసుక తిన్నెలు, సముద్రాలు ఉండేవని, డెల్టా ప్రాంతాల తరహా వాతావరణం అంగారక గ్రహంపై గుర్తించామని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీ జియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బెంజమిన్ కార్డెనాస్ తెలిపారు. మార్స్‌పై గాలి దాని వల్ల సంభవించే అలలు, ఇసుక తిన్నెలకు కొరత ఉండేది కాదని చెప్పారు.

**పరిశోధనలా సాగించిన వైనం..**

తియాన్వెన్ 1 మిషన్‌లో భాగంగా మార్స్‌పై ఉటోపియా ప్లానీటియా ఏరియాలో ల్యాండ్ అయిన ఝురాంగ్ రోవర్.. ఉపరితలం నుంచి 260 అడుగుల అంటే దాదాపుగా 80 మీటర్ల మేర స్కాన్ చేసింది. దీనికి సంబంధించిన సమగ్ర డేటాను గ్రౌండ్ స్టేషన్‌కు పంపించింది. భూమిపై తీరప్రాంతా ల్లో మాత్రమే కనిపించే ఖనిజాలు, ఇసుక, మం దంగా–వాలుగాఉండే పొరలు బయటపడ్డాయి.

**అలలు, ఆటుపోట్లు ఉంటేనే..**

అలలు, ఆటుపోట్లు ఉంటేనే అలాంటి పొరలు, దానికి సంబంధించిన నిర్మాణాలు ఏర్పడతాయని బెంజమిన్ కార్డెనాస్ విశ్లేషించారు. భూమిపై తొలి జీవం వృద్ధి చెందినప్పుడు ఎలాంటి వాతావరణం ఉండేదో.. అలాంటి వాతావరణం 3.5–4 బిలియన్ సంవత్సరాల కిందట మార్స్ పై ఉండేదని అన్నారు.

**సూక్ష్మజీవుల ఉనికి..**

అప్పట్లో సూక్ష్మజీవుల ఉనికి, అవి దీర్ఘకాలం పాటు జీవించి ఉండటానికి గల అనుకూల వాతావరణ పరిస్థితులను ఒకప్పుడు మార్స్‌పై ఉండేవనడానికి బలమైన సాక్ష్యాలు వెలుగులోకి వచ్చినట్టయిందని కార్డినెస్ చెప్పారు. మార్స్– ఒకప్పుడు నివాసయోగ్యంగా ఉండేదనే విషయాన్నీ కొట్టిపారేయలేమని చెప్పారు.

**అన్ని ఆధారాలు..**

భూమిపై తీర ప్రాంతాల్లో ఏ తరహాలో గాలుల తీవ్రత ఉంటుందో అలాంటి వాతావరణమే మార్స్‌పై ఉండేదని, బలమైన గాలులు వీచినప్పుడే అలలు ఉవ్వెత్తున ఎగుస్తాయని, ఇసుక తిన్నెలు ఏర్పడతాయని బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్శిటీ ఎర్త్ అండ్ ప్లానెటరీ సైన్స్ ప్రొఫెసర్ మైఖేల్ మాంగా తెలిపారు.

**నదులు సైతం..**

మార్స్‌పై కొన్ని సంవత్సరాల పాటు మంచు రహిత సముద్రం ఉండేదని, విభిన్నమైన అవశేషాలు కొట్టుకువచ్చాయనడానికి ఆధారాలు లభించాయని మైఖెల్ మాంగా చెప్పారు. నదులు విస్తారంగా ప్రవహించినప్పుడే ఇలాంటి వేర్వేరు ఖనిజాలు, ఇతర అవశేషాలు లభించగలవని పేర్కొన్నారు.

# జామపండుతో ఆరోగ్య అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు!

**జామ పండులో ఫుల్ పోషకాలు :** జామ పండులో విటమిన్ సి, విటమిన్ ఏ, విటమిన్ కే, కేలరీలు, పొటాషియం, కార్బోహైడ్రేడ్లు, డైటరీ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో తక్కువ క్యాలరీలు, ఫైబర్ అధిక ంగా ఉంటుంది. ఈ కారణంగా వీటిని ప్రతి రోజు తింటే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబు తన్నారు. జామ పండు తినడం వల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

**జామపండుతో రక్తపోటుకు చెక్ :** జామపండులో ఉండే పొటాషియం, సోడియం కారణంగా ఇది అధిక రక్తపోటును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. జామ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. జామపండు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచేందుకు సహాయపడుతుంది. జామపండులో తక్కువ క్యాలరీలు ఉండడం వల్ల ఇది బరువు తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తుంది

**కంటి ఆరోగ్యాన్ని కాపాడే జామపండు :** జామ పండులో ఉండే ఫోలేట్ మన పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో మహిళలకు వచ్చే నొప్పిని తగ్గిస్తుంది.జామపండు దృష్టిని మెరుగుపరుస్తు ంది. కంటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న జామపండును రోజుకు ఒకటి తింటే ఎంతో మంచిది. దీనివల్ల మనకు ప్రయోజనమే కానీ నష్టం లేదు.

**మెదడు పనితీరుకు, చర్మ ఆరోగ్యానికి జామపండు**

**జామపండు నరాలకు పట్టుత్వాన్ని ఇస్తుంది :** మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. జామ పండులో విటమిన్ కే, విటమిన్ బి త్రీ పుష్కలంగా ఉండడం వల్ల ఇది మెదడు పనితీరును



మెరుగుపరుస్తుంది. జామ పండులో లైకోపీన్, కెరోటిన్, విటమిన్ ఏ, విటమిన్ సి పుష్కలంగా ఉండడం వల్ల ఇది మన చర్మ సంరక్షణకు ఎంతగానో దోహదం చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి ముడతలు తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

# ఇంజినీరింగ్ ఫీజుల మోత!

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఫీజుల మోత మోగనున్నది. భారీగా ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ట్యూషన్ ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) చేపట్టిన కసరత్తు చివరిదశకు చేరింది. ఇప్పటికే కాలేజీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన టీఏఎఫ్ఆర్సీ మంగళవారం నుంచి కాలేజీల వారీగా విచారణ చేపట్టనున్నది.

**ట్యూషన్ ఫీజుల పెంపునకు రంగం సిద్ధం**

**నేటి నుంచి టీఏఎఫ్ఆర్సీ విచారణలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 :** రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఫీజుల మోత మోగనున్నది. భారీగా ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ట్యూషన్ ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) చేపట్టిన కసరత్తు చివరిదశకు చేరింది. ఇప్పటికే కాలేజీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన టీఏఎఫ్ఆర్సీ మంగళవారం నుంచి కాలేజీల వారీగా విచారణ చేపట్టనున్నది. మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో రోజుకు 19–20 కాలేజీల




ఫీజులపై విచారించనున్నది. సాధారణంగా ఇంజినీరింగ్ కోర్సుల ట్యూషన్ ఫీజులను మూడేండ్లకోసారి పెంచుతున్నారు. చివరగా 2022–23లో పెంచగా.. 2024–25 విద్యాసంవత్సరంతో గడువు ముగిసింది. 2025–28 బ్లాక్ పీరియడ్‌కు ఫీజులు పెంచేందుకు టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదనలు స్వీకరించగా, రాష్ట్రంలోని 163 కాలేజీలు ఫీజుల సవరణకు దరఖాస్తు చేసుకోగా, 19 కాలేజీలు చేసుకోలేదు.నేడు 19 కాలేజీలపై విచారణ..ఫీజుల సవరణపై టీఏఎఫ్ఆర్సీ మంగళవారం19కాలేజీలను విచారించనున్నది.

**పలు కాలేజీల ప్రతిపాదిత ఫీజులు..**

| కాలేజీ | ప్రతిపాదిత ఫీజు |
|---|---|
| సీబీఐటీ | 2,94,614 |
| వీఎన్నార్ విజ్ఞానజ్యోతి | 2,84,200 |
| ఎమ్జీఐటీ | 2,45,000 |
| వాసవి | 2,16,000 |
| ఎస్నార్ | 2,00,000 |
| సీవీఆర్ | 1,98,000 |
| వర్ధమాన్ | 1,90,000 |
| గోకరాజు రంగరాజు | 1,90,000 |

వీటిలో అనురాగ్, అరోరా, అవంతి, బీవీ రాజు, ఏవీఎన్, బాలాజీ, మహావీర్, అబ్దుల్ కలాం, ఏస్, ఐజా, అన్నమాచార్య, అనుబోస్, అర్జున్ తదితర కాలేజీలు ఉన్నాయి. ఈ నెల 27న, మార్చి 1, 4, 5, 7, 8, 10 తేదీల్లో రోజుకు కొన్ని కాలేజీల చొప్పున విచారించనున్నారు. కాలేజీలు సమర్పించిన ఆదాయం, ఖర్చుల ఆధారంగా ఆడిటర్లు కాలేజీలను విచారిస్తారు.

# మరింత లాభాల బాటలో షారూఖ్



భారతదేశంలో క్రికెట్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, అది ఒక భారీ వ్యాపారం. ఈ వ్యాపారంలో అత్యంత విజయవంతమైన యజమానులలో షారూఖ్ ఖాన్ ఒకరు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, ఐపీఎల్ ఫ్రాంచైజీ కేకేఆర్ ద్వారా కూడా ఆయన కోట్లాది రూపాయల లాభాలను ఆర్జిస్తున్నారు.ఒక ఐపీఎల్ జట్టుకు ఆదాయం ప్రధానంగా మూడు మార్గాల ద్వారా వస్తుంది.టీవీ ప్రసార హక్కులు , సెంట్రల్ స్పాన్సర్‌షిప్ ద్వారా వచ్చే లాభాల్లో కొంత భాగాన్ని బీసీసీఐ అన్ని జట్లకు పంచుతుంది. బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ , స్పాన్సర్‌షిప్: జట్టు జెర్సీపై ఉండే లోగోలు, ఇతర స్థానిక స్పాన్సర్‌షిప్‌ల ద్వారా భారీ ఆదాయం లభిస్తుంది. టికెట్ అమ్మకాలు, ప్రైజ్ మనీ: మ్యాచ్ టికెట్ల అమ్మకాలు, టోర్నీలో గెలిస్తే వచ్చే ప్రైజ్ మనీ అదనం.లాభాల లెక్కలు (అంచనా):వార్షిక ఆదాయం: ఒక ఐపీఎల్ సీజన్ ద్వారా కేకేఆర్ సుమారు రూ. 250 నుంచి రూ. 270 కోట్ల వరకు ఆదాయాన్ని గడిస్తోంది.ఖర్చులు: ఆటగాళ్ల జీతాలు, జట్టు నిర్వహణ, ప్రయాణ ఖర్చులు వంటి వాటి కోసం సుమారు రూ. 100 కోట్లు ఖర్చు అవుతాయి.నికర లాభం : అన్ని ఖర్చులు పోను, ఒక్కో సీజన్‌కు కేకేఆర్ ఫ్రాంచైజీకి రూ. 150 నుంచి రూ. 170 కోట్ల నికర లాభం వస్తుందని నివేదికలు చెబుతున్నాయి. షారూఖ్ ఖాన్ వ్యక్తిగత వాటా: కేకేఆర్ జట్టులో షారూఖ్ ఖాన్‌కు 55 శాతం వాటా ఉంది (మిగిలిన వాటా జూహీ చావ్లా, ఆమె భర్త జయ్ మెహతా వద్ద ఉంది). ఈ లెక్కన, ఫ్రాంచైజీకి వచ్చే లాభాల్లో షారూఖ్ ఖాన్ వాటా ఒక్క ఏడాదికి సుమారు రూ. 80 కోట్ల వరకు ఉంటుందని అంచనా.పెరుగుతున్న నెట్ వర్త్: కేకేఆర్ జట్టు విలువ, ఐపీఎల్ ప్రాచుర్యం పెరగడం వల్ల షారూఖ్ ఖాన్ ఆస్తి భారీగా పెరిగింది. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం, ఆయన నికర ఆస్తి విలువ సుమారు రూ. 12,490 కోట్లు. గత ఏడాదిలో ఆయన ఆస్తి సుమారు రూ. 5,000 కోట్లు పెరగడం గమనార్హం. ఇందులో కేకేఆర్ సాధించిన విజయాలు (ముఖ్యంగా 2024 ఐపీఎల్ టైటిల్) కీలక పాత్ర పోషించాయి. సినిమాల్లో పరాజయాలు ఎదురైనా, క్రికెట్ రంగంలో ఆయన వేసిన వ్యూహాలు బాక్సాఫీస్ హిట్ల కంటే ఎక్కువ ఫలితాలను ఇస్తున్నాయి. ఐపీఎల్ 2026 కోసం కేకేఆర్ ఇప్పటికే కామెరూన్ గ్రీన్ (రూ. 25.20 కోట్లు) వంటి ఆటగాళ్లను కొనుగోలు చేసి మరింత బలోపేతం అయింది. జట్టు విజయవంతమైతే, షారూఖ్ లాభాల బాట మరిన్ని రికార్డులను సృష్టించడం ఖాయం.

# నార్త్‌లో మ్యాచ్‌లు నిర్వహించొద్దు



**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్**

ఉత్తర భారతదేశంలో డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు తీవ్ర పొగమంచు సమస్య ఉండటంతో ఆ కాలంలో అక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించొద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ బీసీసీఐని కోరారు. ఆ సీజన్‌లో మ్యాచ్‌లు పెడితే అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతారని, ఇది క్రికెట్ ప్రేమికులను మోసం చేసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు.ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో బుధవారం జరగాల్సిన భారత్ – దక్షిణాఫ్రికా మధ్య నాలుగో టీ20 మ్యాచ్ తీవ్ర పొగమంచు కారణంగా టాస్ కూడా వేయకుండానే రద్దుకావడంపై థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎకానా స్టేడియాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఆట కొనసాగించడం అసాధ్యమైంది. దీనితో ఉత్తర భారతంలో శీతాకాలంలో మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన శశి థరూర్ మాట్లాడుతూ, “డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలోని చాలా ప్రాంతాల్లో పొగమంచు సాధారణమే. ఆ సమయంలో బంతి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఎలా నిర్వహిస్తారు” అని ఆయన ప్రశ్నించారు. “నిన్న దేశం మొత్తం నిరాశకు గురైంది. భారత్ – దక్షిణాఫ్రికా మ్యాచ్ చూడాలని ఎదురు చూసిన అభిమానులు తీవ్రంగా బాధపడ్డారు. కాబట్టి నా వాదన ఒక్కటే. ఈ కాలంలో మ్యాచ్‌లను దక్షిణ భారతంలో నిర్వహించాలి” అని థరూర్ సూచించారు. “నా నియోజకవర్గమైన తిరువనంతపురంలో అద్భుతమైన స్టేడియం ఉంది. మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ వాతావరణ పరిస్థితులు చాలా అనుకూలంగా ఉంటాయి. ఇక్కడికి వచ్చి మ్యాచ్‌లు ఆడండి” అని ఆయన అన్నారు. డిసెంబర్ చివర్లో మహిళల క్రికెట్ జట్టు తిరువనంతపురంలో ఆడబోతోందని గుర్తుచేసిన థరూర్, షెడ్యూలింగ్ చేస్తూ వాతావరణ పరిస్థితులను బీసీసీఐ తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.“కేరళతో పాటు దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాల్లో ఈ తరహా పొగమంచు సమస్య ఉండదు. కాబట్టి డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలో మ్యాచ్‌లు వద్దు క్రికెట్ అభిమానులను మోసం చేయొద్దు” అని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై బుధవారం రాత్రి సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో కూడా థరూర్ పోస్టు చేశారు. లఖ్‌నవూలో ఏక్యూఐ 411గా ఉండగా, తిరువనంతపురంలో కేవలం 68 మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. “పొగమంచు కారణంగా మ్యాచ్ ప్రారంభించలేకపోయారు. ముందే తిరువనంతపురంలో షెడ్యూల్ చేసి ఉంటే సమస్యే ఉండేది కాదు” అని ఆయన విమర్శించారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లో శశి థరూర్‌తో పాటు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మధ్య ఈ అంశంపై ఆసక్తికర చర్చ జరిగింది. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 మధ్య మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై మరింత జాగ్రత్త అవసరమని శుక్లా అంగీకరించారు. “ఈ కాలంలో తరచూ వాతావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. కాబట్టి షెడ్యూలింగ్‌లో ఎక్కువ శ్రద్ధ పెట్టాలి” అని ఆయన తెలిపారు.దీనికి స్పందించిన థరూర్, జనవరిలో జరిగే మ్యాచ్‌లను కేరళకు మార్చాలని సూచించారు. అయితే ఇది కేవలం కేరళకే సంబంధించిన అంశం కాదని శుక్లా స్పష్టం చేశారు. “బీసీసీఐ రొటేషన్ పాలసీ ప్రకారం కేరళకు ఇప్పటికే మ్యాచ్‌లు వస్తున్నాయి” అని ఆయన చెప్పారు.

# రోల్ బాల్ వరల్డ్ కప్ విజేతగా భారత్!




రోల్ బాల్ వరల్డ్ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11–10 తేడాతో, మహిళల జట్టు 3–2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి.ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ.. పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి.2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో మన జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు.రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. సింపుల్‌గా చెప్పాలంటే.. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ఈ క్రీడలో ఆటగాళ్ళు రోలర్ స్కేట్స్ ధరించి, బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ఎదుటి జట్టు గోల్ పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు.ఆటగాళ్ళు స్కేటింగ్ చేస్తూ బంతిని చేత్తో పట్టుకుని బాస్కెట్ బాల్ తరహాలో డ్రిబ్లింగ్ చేయాలి. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు. కానీ గోల్ వేసేటప్పుడు మాత్రం ఒక చేయి మాత్రమే ఉపయోగించాలి. నిర్ణీత సమయంలో ఏ జట్టు ఎక్కువ గోల్స్ చేస్తే ఆ జట్టు విజేతగా నిలుస్తుంది. భారత్‌లో పుట్టిన ఈ క్రీడను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ఆడుతున్నారు.

# ఆపరేషన్ ఐపీఎల్..

ఈ ఏడాది పాకిస్థాన్‌కు వరుసగా దెబ్బ మీద దెబ్బ తగులుతున్నాయి. పెహల్గామ్ ఘటన తర్వాత ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌ని భారత్ వణికించింది. అదే రీతిలో అటు మహిళలు, పురుషుల క్రికెట్‌లో కూడా పాకిస్థాన్‌పై టీమ్‌ఇండియా ఆధిపత్యం చలాయించింది. ఇప్పుడు మరోసారి పాకిస్థాన్‌కు మరో గట్టి దెబ్బ తగిలింది. అది బీసీసీఐ నిర్వహించే ఐపీఎల్ రూపంలో. మంగళవారం అనగా డిసెంబరు 16న జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలం ఇప్పుడు పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)ను చిక్కుల్లోకి నెట్టేసింది. వచ్చే ఏడాది ఒకే సమయంలో అనగా మార్చి 2026లో ఈ రెండు లీగ్‌లు ప్రారంభం కానున్నాయి. అయితే గతంలో పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ప్రాతినిధ్యం వహించిన 11 మంది విదేశీ ఆటగాళ్లను ఇప్పుడు ఐపీఎల్ ఎగరేసుకుపోయింది. దీని ఫలితంగా పాకిస్థాన్ సూపర్ లీగ్‌కు సుమారు రూ.27.3 కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ వేదికగా జరుగుతోన్న సూపర్ లీగ్‌లోని వివిధ జట్ల తరఫున ఆడుతున్న 11 మంది కీలక ఆటగాళ్లను ఐపీఎల్ యాజమాన్యాలు నిన్న జరిగిన వేలంలో భారీ ధరలకు దక్కించుకున్నాయి. ఇందులో 10 మందిని వేలంలో కొనగా, మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ కింగ్స్ ముందే రిటైన్ చేసుకుంది. నివేదికల ప్రకారం.. ఐపీఎల్, పీఎస్ఎల్ రెండు సీజన్లు కూడా వచ్చే ఏడాది మార్చి 26 నుండే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఒకే సమయంలో రెండు లీగ్‌లు పోటీ పడితే, ఆటగాళ్లు సహజంగానే ఆర్థికంగా లాభదాయకమైన, ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఐపీఎల్‌కే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఆటగాళ్లు పీఎస్ఎల్‌ను వదిలి ఐపీఎల్‌ను ఎంచుకోవడం వల్ల పాకిస్తాన్ లీగ్ తన కళను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది పీఎస్ఎల్ నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో పీఎస్ఎల్ నిర్వాహకులు దిద్దుబాటు చర్యలు మొదలుపెడుతున్నట్లు సమాచారం. పాకిస్థాన్ సూపర్ లీగ్‌కు చెందిన క్వెట్టా గ్లాడియే టర్స్, ఇస్లామాబాద్ యునైటెడ్ వంటి జట్లు తమ ప్రధాన విదేశీ ఆటగాళ్లను కోల్పోవడం వల్ల ఆ జట్లు భారీగా బలహీనపడ్డాయి. ఇప్పుడు ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కొత్త ఆటగాళ్లను వెతుక్కోవడం పీఎస్ఎల్ ఫ్రాంచైజీలకు పెద్ద సవాలుగా మారింది.





# మెక్‌గ్రాత్ రికార్డును బద్దలుకొట్టిన నాథన్ లియాన్

ఆస్ట్రేలియా స్పిన్ మాంత్రికుడు నాథన్ లైయన్ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. అడిలైడ్ ఓవల్ వేదికగా జరుగుతున్న మూడో యాషెస్ టెస్టులో ఇంగ్లాండ్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన లైయన్, ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు తీసి గ్లెన్ మెక్‌గ్రాత్ (563 వికెట్లు) రికార్డును తుడిచిపెట్టేశాడు. ఈ మ్యాచ్‌కు ముందు లైయన్ 562 వికెట్లతో ఉన్నాడు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 10వ ఓవర్‌లో మొదట ఓలీ పోప్‌ను అవుట్ చేసి మెక్‌గ్రాత్ రికార్డును సమం చేశాడు. అదే ఓవర్ చివరి బంతికి బెన్ డకెట్‌ను క్లీన్ బౌల్డ్ చేసి 564వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా ఆస్ట్రేలియా తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా అవతరించాడు.ఆస్ట్రేలియా తరఫున షేన్ వార్న్ (708 వికెట్లు) అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు లైయన్ రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో లైయన్ ప్రస్తుతం ఆరో స్థానంలో ఉన్నాడు. గ్లెన్ మెక్‌గ్రాత్ తన 14 సంవత్సరాల టెస్ట్ కెరీర్‌లో 124 మ్యాచ్‌లు ఆడి, 563 వికెట్లు పడగొట్టాడు. ఈ కాలంలో, అతను 29 ఐదు వికెట్లు, మూడుసార్లు పది వికెట్లు పడగొట్టాడు. మెక్‌గ్రాత్ చివరి టెస్ట్ తర్వాత పద్దెనిమిది సంవత్సరాల తర్వాత, నాథన్ లియాన్ ఇప్పుడు తన టెస్ట్ వికెట్ల సంఖ్యను అధిగమించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన అడిలైడ్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో అతను ఈ ఘనతను సాధించాడు. బెన్ డకెట్‌ను అవుట్ చేయడం ద్వారా లియాన్ తన 564వ టెస్ట్ వికెట్‌ను తీసుకున్నాడు. లియాన్ తన 141 టెస్టులలో 261వ ఇన్నింగ్స్‌లో మెక్‌గ్రాత్‌ను అధిగమించాడు.విశేషమేమిటంటే, లైయన్ తన క్రికెట్ కెరీర్ ప్రారంభానికి ముందు అడిలైడ్ ఓవల్ మైదానంలోనే పిచ్ క్యూరేటర్‌గా పనిచేశాడు. ఇప్పుడు అదే మైదానంలో ఆస్ట్రేలియా దిగ్గజం రికార్డును అధిగమించడం ఒక సినిమా లెవల్ ట్విస్ట్ అని క్రికెట్ అభిమానులు కొనియాడుతున్నారు. లైయన్ తన రికార్డును బద్దలు కొట్టిన సమయంలో గ్లెన్ మెక్‌గ్రాత్ కామెంట్రీ బాక్స్‌లో ఉన్నాడు. తన రికార్డు పోయిందని సరదాగా నటిస్తూ, పక్కనే ఉన్న కుర్చీని విసిరేయబోతున్నట్లు మెక్‌గ్రాత్ ఇచ్చిన రియాక్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.



# తెల్లని దుస్తుల్లో మెరిసిపోతున్న స్మృతి మంధాన

భారత మహిళా స్టార్ క్రికెటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సోషల్ మీడియాలో తన తాజా ఫోటోలతో సందడి చేస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్మృతి మంధాన.. తెల్లటి వన్-పీస్ డ్రెస్‌లో ఎంతో అందంగా కనిపించింది. బుగ్గపై డింపుల్, ముఖంలో చిరునవ్వుతో ఉన్న ఆమె ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.గత నెలలో స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలో కొన్ని ఒడిదుడుకలు ఎదురైన విషయం తెలిసిందే. పలాష్ ముచ్చల్‌తో వివాహం రద్దయిందని స్వయంగా స్మృతి మంధాన సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ వార్త అభిమానులను కొంత ఆందోళనకు గురిచేసింది. అయితే కష్టకాలం నుంచి ఆమె వేగంగా కోలుకుంటోంది. “క్రికెట్టే నా సర్వస్వం, నా మొదటి ప్రేమ” అని ఆమె ఇటీవల పేర్కొంది. తాజా ఫోటోల్లో ఆమె ఉత్సాహంగా ఉండటం చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.క్రికెట్ మైదానంలో స్మృతి మంధాన సందడి మళ్లీ మొదలుకానుంది. డిసెంబర్ 21 నుండి భారత్, శ్రీలంక జట్ల మధ్య 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో స్మృతి కీలక పాత్ర పోషించనుంది. జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఇందులో స్మృతి మంధాన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు సారథ్యం వహించనుంది.మహిళల ప్రీమియర్ లీగ్ మొదటి మ్యాచ్‌లోనే ఆసక్తికర పోరు జరగనుంది.



# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్



మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



# హద్దుమీరిన అభిమానం

## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం

కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడ్డారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.



# ఏఐ మార్ఫింగ్ ఫొటోలపై మండిపడ్డ నటి నివేదా థామస్

ప్రముఖ నటి నివేదా థామస్ తన ఫొటోలను కొందరు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీతో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అసభ్యకరంగా ప్రచారం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చట్టవిరుద్ధమని, తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని పేర్కొంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు.ఇటీవల నివేదా థామస్ క్రీమ్ కలర్ చీరలో ఉన్న ఒక అందమైన ఫొటోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఫొటో వైరల్ అవ్వగా, కొందరు ఆకతాయిలు దానిని ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్చి ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడం ప్రారంభించారు. ఈ విషయం ఆమె దృష్టికి రావడంతో తీవ్రంగా స్పందించారు.ఈ సందర్భంగా నివేదా తన ప్రకటనలో, "నా అనుమతి లేకుండా నా ఫొటోను ఏఐ సాయంతో మార్చి సర్క్యులేట్ చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఇది చాలా బాధాకరం. ఆమోదయోగ్యం కాదు, చట్టవిరుద్ధం కూడా. ఇది నా వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే" అని పేర్కొన్నారు."ఈ విషయాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. అజ్ఞాత ఖాతాల ద్వారా ఇలాంటివి చేస్తున్న వారు వెంటనే ఆ కంటెంట్‌ను తొలగించాలి. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇటువంటి వాటిని ఎవరూ షేర్ చేయవద్దు, ప్రోత్సహించవద్దు" అని ఆమె విజ్ఞప్తి చేశారు. 'జెంటిల్మన్', 'నిన్ను కోరి', 'జై లవకుశ', 'వకీల్ సాబ్' వంటి విజయవంతమైన చిత్రాలతో నివేదా థామస్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలు.

# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.



# నాకు మరో ట్యాగ్ వద్దు... అమ్మానాన్న ఇచ్చిన ట్యాగ్ చాలు : అడివి శేష్



హీరోలు తమ పేరు ముందు బిరుదులు, ట్యాగ్‌లు పెట్టుకోవడం సాధారణం. కానీ, యువ కథానాయకుడు అడివి శేష్ మాత్రం అందుకు భిన్నం. తన పేరుకు ముందు ఎలాంటి ట్యాగ్ పెట్టుకోకపోవడానికి గల కారణాన్ని ఆయన తాజాగా వెల్లడించారు. "మా అమ్మానాన్న నాకు చిన్నప్పుడే 'అడివి శేష్' అనే ట్యాగ్ ఇచ్చారు. అందుకే మరో ట్యాగ్ వద్దు అనుకున్నా. ఏదో ఒక ట్యాగ్ పెట్టుకుని, పీఆర్ వాళ్లతో లోగోలు చేయించుకోవడం నాకు నచ్చదు. తరతరాలు గుర్తుండిపోయే సినిమాలు తీసి ప్రేక్షకుల మనసులో స్థానం సంపాదించడమే నాకు ఇష్టం" అని ఆయన స్పష్టం చేశారు.అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ చిత్రం 'డెకాయిట్'. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా శేష్ మాట్లాడుతూ, 'డెకాయిట్' చిత్రానికి మృణాల్ ఠాకూర్ ప్రత్యేక ఆకర్షణ అని తెలిపారు. సినిమాల మధ్య గ్యాప్ ఎందుకు వస్తుందన్న ప్రశ్నకు.. "ఒక చిన్న టీజర్ కోసమే గంటల తరబడి కష్టపడ్డాం. నాణ్యమైన సినిమాను ప్రేక్షకులకు అందించాలనేదే నా ఉద్దేశం. అందుకే ఆలస్యమైనా ఫర్వాలేదు" అని వివరించారు.'డెకాయిట్' చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ఉగాదికి విడుదల కానుందని తెలిపారు.

# రెండు ఓటిటిల్లోకి సంతాన ప్రాప్తిరస్తు




ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమ్రింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చైతన్య (విక్రాంత్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి (చాందిని చౌదరి) ను చూసి ప్రేమలో పడతాడు.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com